


'సోమశిల'లో 46.678 టీఎంసీల నీరు



అనంతసాగరం : సోమశిల జలాశయానికి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. సోమవారం 18,990 క్యూసెక్కుల వరద వస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా 46.678 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ డెల్టాకు 550, కండలేరుకు 4000, ఉత్తర, దక్షిణ కాలువలకు 10 క్యూసెక్కులు చొప్పున సరఫరా చేస్తున్నారు.

ఉండ్రాలయ్యా.. ఇక ఉంటామయ్యా!

అట్టహాసంగా గణనాథుల నిమజ్జనం

సముద్రతీరం, పెన్నా పరివాహకంలో కోలాహలం

మూడు రోజులపాటు పూజలందుకున్న గణనాథుల ప్రతిమలను భారీ ఊరేగింపులతో సోమవారం నిమజ్జనం చేశారు. వివిధ రకాల పూలతో అలంకరించిన వాహనాలలో గణనాథులను కొలువుదీర్చి డప్పుల వాయిద్యాలు.. వివిధ కళాకారుల నృత్యాలు... బాణసంచా పేలుళ్ల, డిజే పాటల నడుమ యువత కేరింతలు కొడుతూ అట్టహాసంగా ఊరేగింపు జరిగింది. జిల్లాలోని సముద్ర తీర ప్రాంతాలు, పెన్నా నదీ పరివాహకం, వాగులు, వంకలు, చెరువులు ఇతర జలవనరులలో అశేష భక్తజనం నడుమ ప్రతిమలను గంగాజలంలో కలిపారు. నెల్లూరు నగరంలో దాదాపు 200 ప్రతిమలకుపైగా గణేష్ ఘాట్‌ల వద్ద క్రేన్‌ల సాయంతో నిమజ్జనాలు జరిగాయి. నగర పాలక సంస్థ, పోలీసు ఇతర శాఖల పర్యవేక్షణలో ఈ కార్యక్రమాలు జరిగాయి. గణేష్ నిమజ్జనాలు తిలకించేందుకు భారీ సంఖ్యలో భక్తులు ఘాట్ వద్దకు చేరారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీ సంఘటనలు జరగకుండా, ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు పోలీసులు విస్తృత ఏర్పాట్లు చేశారు. ఇందుకూరుపే మండలం మైపాడు, టీపీగూడూరు కొత్తకోడూరు, కావలి మండలం తుమ్మలపెంట, ఉలవపాడు మండలం అలగానిపాళెం తదితర తీరప్రాంతాలు నిమజ్జనానికి వచ్చిన గణనాథులతో నిండిపోయాయి.

– ఆంధ్రజ్యోతి బృందం



కావలి : తుమ్మలపెంట తీరానికి తరలి వచ్చిన గణనాథులు

నిమజ్జనంలో అపశ్రుతి

కావలి రూరల్ : వినాయక నిమజ్జన వేడుకలో అపశ్రుతి చోటు చేసుకుంది. ట్రాక్టర్ కింద పడి ఓ యువకుడు మృతి చెందాడు. కావలిలోని ఇందిరానగర్‌లో ఏర్పాటు చేసిన విఘ్నేశ్వరుడి ప్రతిమను సోమవారం ఊరేగింపు అనంతరం ట్రాక్టర్‌లో తమ్మలపెంట సముద్ర తీరంలో నిమజ్జనానికి బయలుదేరారు. మార్గమధ్యంలోని కొనదిన్నె సమీపంలో గతుకుల రోడ్డుపై ట్రాక్టర్ కుదుపులకు ట్రక్ లో ఉన్న మొగిలి రమేష్ (30) అదుపు తప్పి కింది పడ్డాడు. దీంతో ట్రాక్టర్ ట్రాలీ టైరు రమేష్‌పైకి ఎక్కడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని ఏరియా వైద్యశాలకు తరలించారు. కాగా, ఇందిరానగర్‌కు చెందిన శ్రీనివాసులు, మేరి దంపతులకు రమేష్‌తోపాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. రమేష్ మృతితో ఇందిరానగర్‌లో విషాద ఛాయలు అలుముకున్నాయి.



అందరూ జాగ్రత్తగా ఉండండి..
తుమ్మలపెంట తీరంలో పోలీసుల పహారా



నెల్లూరు : గణేష్ ఘాట్ వద్ద వినాయక ప్రతిమలను గంగలో కలుపుతున్న క్రేన్‌లు



సంగం : క్రేన్ సాయంతో పెన్నా నదిలో విఘ్నేశ్వరుడి ప్రతిమను నిమజ్జనం చేస్తూ..



కావలి పట్టణంలో కళాకారుల విన్యాసం



ఉదయగిరి : చుక్కనీరు లేని నేలటూరు చెరువు

నిమజ్జనానికి నీరేది!?

తీవ్ర వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా నీటి వనరులు అడుగంటడంతో గణనాథుల నిమజ్జనానికి కష్టాలు తప్పడంలేదు. మెట్ట ప్రాంతమైన ఉదయగిరి నియోజకవర్గంలో ఉత్సవ కమిటీలు సుమారు వెయ్యికిపైగా ప్రతిమలను ఏర్పాటు చేశాయి. పూజలు అందుకున్న ప్రతిమలను నిమజ్జనం చేసేందుకు చెరువులు, వాగులు, వంకల్లో నీరు లేకపోవడంతో ఏం చేయాలో అర్థంకాక నిర్వాహకులు తలలు పట్టుకుంటున్నారు. గండిపాళెం జలాశయంలో అరకొరగా నీరున్నా అక్కడ విగ్రహాల నిమజ్జనం నిషేధం. నీటి వనరులు, సముద్ర ప్రాంతానికి వెళ్లి విగ్రహాలను నిమజ్జనం చేయాలంటే వ్యయప్రయా సాలతో కూడుకోవడంతో ఇబ్బందులు తప్పవు.

– ఉదయగిరి రూరల్



పట్టర పట్టు హైలెస్సా..!

దిగుబడి లేదు.. ధర అంతకన్నా లేదు!



పాతాళపల్లి వద్ద రోడ్డు పక్కన ఆరబెట్టిన వేరుశనగ మొక్కలు

అనంతసాగరం : ఈసారి వేరుశనగకు ఆశించిన ధర, దిగుబడి లేకపోవడంతో రైతన్నలో ఆందోళన నెలకొంది. కనీసం పెట్టుబడులు అయినా రాబట్టుకొనే ప్రయత్నంలో ఉన్నారు. అనంతసాగరం మండలంలోని పాతాళపల్లి, గోవిందమపల్లి, కమ్మవారిపల్లి, పీకేపాడు, చిలకలమర్రి, గౌరవరం గ్రామాల్లో సుమారు 600 ఎకరాల్లో వేరుశనగ సాగు చేశారు. కొన్నిచోట్ల కోతలు పూర్తవగా మిగిలిన చోట్ల ఆ పనిలో రైతులు నిమగ్నమయ్యారు. ఒక ఎకరాలో వేరుశనగ సాగుకు అన్ని ఖర్చులు కలుపుకొని రూ.30 వేల నుంచి 35 వేల వరకు ఉంటుంది. అయితే, అందుకు అనుగుణంగా దిగుబడి, ధర మాత్రం ఉండటం లేదు. ఎకరాకు 35 నుంచి 45 బస్తాల వరకు (ఒక్కో బస్తా 40 కిలోలు) దిగుబడి రావాల్సి ఉండగా 25 బస్తాలకు మించడం లేదు. గతేడాది ఇదే సీజన్‌లో బస్తా రూ.3 వేల నుంచి 3,200 పలకగా ప్రస్తుతం రూ.2200లకు మించడం లేదని అన్నదాతలు వాపోతున్నారు. ఈ క్రమంలో సాగుపై వెచ్చించిన ఖర్చులు కూడా రాక ఇబ్బందులు పడుతున్నట్లు చెబుతున్నారు. బహిరంగ మార్కెట్‌లో ధర ఆశాజనకంగా ఉన్నా రైతుల వద్దకొచ్చేసరికి దిగజారడంతో నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

'నేతన్న' ఇంట వెలుగులు

వంద యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ● కూటమి ప్రభుత్వం నిర్ణయం?

సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చేదిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇప్పటికే అన్ని రకాల పింఛన్లు పెంచడంతోపాటు అన్న క్యాంటీన్లను పునఃప్రారంభించింది. తాజాగా చేనేత కార్మికులను ఆదుకునేందుకు ఉచిత కరెంటు పథకం అమలుకు నిర్ణయించినట్లు విశ్వసనీయ సమాచారం. 100 యూనిట్లలోపు ఉచిత విద్యుత్ అమలుకు ప్రభుత్వం జీవో తేనుంది.



సంగం, సెప్టెంబరు 9 : జిల్లాలో అధికారికంగా 6,850 చేనేత మగ్గాలు ఉండగా, అనధికారికంగా మరో రెండు వేలు వరకు ఉన్నాయి. వాస్తవానికి జిల్లాలో చేనేత కుటుంబాలు 25 వేల వరకు ఉన్నాయి. కానీ వీరంతా నేత పని గిట్టుబాటుకాక తాపీ పనులు, వ్యవసాయ కూలీలుగా మారిపోయారు. అలాగే మరో 7వేల కుటుంబాలు చేనేత ఉప కులాల వారు ఉన్నారు. చేనేత రంగంపై ఆధారపడి 18 ఉపవృత్తుల వారు ఉన్నారు. 2014-19లో అప్పటి టీడీపీ ప్రభుత్వంలో చేనేతలకు అనేక రాయితీ పథకాలతోపాటు ఆరోగ్య బీమా అమలు చేశారు. 2019లో ఎన్నికల ముందు చేనేతలకు వంద యూనిట్ల వరకు ఉచిత కరెంటు అమలుకు శ్రీకారం చుట్టింది. అయితే, అప్పటి ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి రావడంతో ఉచిత కరెంటుతోపాటు అప్పటివరకు ఉన్న సంక్షేమ, రాయితీ పథకాలను నిలిపివేసి 'నేతన్న నేస్తం' పథకంతో సరిపెట్టింది. దీంతో చేనేతలకు ఉచిత కరెంటు అమలు మరుగున పడింది. ప్రస్తుతం విద్యుత్ బిల్లులు భారీగా వస్తున్నాయి. రూ.500 నుంచి 700 వరకు బిల్లు వస్తుండగా నేతన్నకు భారంగా మారింది.

● అమలుపై స్పష్టత కరువు

ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి చేనేతలకు ఉచిత కరెంటు హామీ ఇచ్చింది. అధికారంలోకి రావడంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేనేతలకు వంద యూనిట్ల ఉచిత కరెంటు అమలుకు నిర్ణయించినట్లు సమాచారం. అయితే, చేనేత కార్మికులు అందరికీ గుర్తింపు కార్డులు లేవు. గతంలో ప్రభుత్వం ఆదేశించినా సకాలంలో చేనేత, జౌళి శాఖ గుర్తింపు కార్డులు పూర్తిస్థాయిలో అందచేయలేకపోయింది. అంతేగాక వైసీపీ ప్రభుత్వం కేవలం మగ్గం ఉన్న నేత కార్మికులకే నేతన్న నేస్తం అమలు చేసింది. అందులో కూడా అనేక కొర్రీలు చూపి పథకానికి అనర్హులుగా ప్రకటించి నిలిపివేసింది. దీంతో చాలా మంది నేతన్న నేస్తానికి నోచుకోలేదు. అంతేగాక ఉప వృత్తులవారికి మొండిచేయి చూపింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం 'నేతన్న నేస్తం' లబ్ధిదారులకే ఉచిత కరెంటు అమలు చేస్తుందా!? లేదా సర్వే చేసి చేనేత కార్మికులతోపాటు ఉప వృత్తులు చేసే వారికీ వర్తింపు చేస్తుందా అనేది స్పష్టత లేదు. ప్రభుత్వం జీవో విడుదల చేస్తేగాని స్పష్టత రాదని నేత కార్మికులు పేర్కొంటున్నారు. కాగా, ఉచిత కరెంటుపై తమకు ఎటువంటి సమాచారం లేదని, జీవో విడుదలైన తర్వాతే స్పష్టత వస్తుందని చేనేత,జౌళి శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వరప్రసాద్ పేర్కొన్నారు.

300 యూనిట్లకు పెంచాలి

ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి చేనేత కార్మికులకు 300 యూనిట్ల వరకు ఉచిత కరెంటు ఇస్తామని హామీ ఇచ్చింది. ఇప్పుడు 2019లో టీడీపీ ప్రకటించిన 100 యూనిట్లకు పరిమితం చేసేలా ఉంది. దీనివల్ల చాలా మంది నేత కార్మికులు ఉచిత కరెంటుకు అనర్హులవుతారు. 300 యూనిట్లకు అమలు చేయాలి.

– మాగం గిరిబాబు, సంగం

ఉప వృత్తులకూ ఇవ్వాలి

మగ్గం నేసేవారితోపాటు కండెలు చుట్టేవారు, అచ్చులు అతికేవారు, పొడుగు పట్టేవారు కూడా చేనేత కార్మికుల కిందకు వస్తారు. వీరంతా చేనేత ఉప వృత్తుల వారే. వైసీపీ ప్రభుత్వ మగ్గం నేసేవారికే పథకాన్ని అమలు చేసి అన్యాయం చేసింది. కూటమి ప్రభుత్వమైనా అందరికీ ఉచిత కరెంటు అమలు చేయాలి.

– జె చౌడయ్య, రాళ్లచెలిక

14 నుంచి పరిశుభ్రత కార్యక్రమాలు

● 2వ తేదీ వరకు నిర్వహణ : కలెక్టర్

నెల్లూరు (హరనాథపురం), సెప్టెంబరు 9 : ఈ నెల 14 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు 'స్వభావ్ స్వచ్ఛత- సంస్కార్ స్వచ్ఛత' పేరుతో జిల్లాలో ప్రత్యేక పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఆనంద్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని శంకరన్ సమావేశ మందిరం నుంచి సబ్ కలెక్టరు, ఆర్డీఓలు, తహసీల్దార్లు, ఎంపీడీఓలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్షించారు. స్వచ్ఛత మిషన్‌ను ప్రారంభించి పదేళ్ల అయిన సందర్భంగా దేశవ్యాప్తంగా పరిశుభ్రతా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం అమలు కోసం జిల్లాలో 15 మంది అధికారులతో ప్రత్యేక స్టీరింగ్ కమిటీని ఏర్పాటు చేశామన్నారు. జిల్లావ్యాప్తంగా అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాలను, బ్లాక్ స్పాట్లు గుర్తిం , విద్యార్థులు, పొదుపు సంఘాల సభ్యులు, రైతులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తదితరుల సహకారంతో శ్రమదానం ద్వారా శుభ్రపరచడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారికి గాంధీ జయంతి నాడు అవార్డులు, సఫాయి మిత్రులను సన్మానించనున్నట్లు చెప్పారు. ఈ సమీక్షలో డీపీఓ సుస్మితా రెడ్డి పాల్గొన్నారు.

వీడియో రీల్స్ పోటీలు

● ఈ నెల 22 వరకు చాన్స్

నెల్లూరు(సాంస్కృతికం), సెప్టెంబరు 9 : ప్రపంచ పర్యాటక దినోత్సవం (సెప్టెంబరు 27) సందర్భంగా చారిత్రాత్మక ప్రదేశాలు, ప్రముఖ ఆలయాలు, ఔన్నత్యం తెలిపేలా వీడియో - రీల్స్ రూపొందించి సెప్టెంబరు 22లోగా ఆన్‌లైన్ ద్వారా పంపాలని పర్యాటక అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలు జిల్లా టూరిజం కౌన్సిల్ చైర్మన్, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోటీలకు పంపే వీడియోలు ఒక నిమిషం నిడివి కలిగిన రీల్స్ ఉండాలని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన ప్రకృతి ప్రేమికులు జిల్లాలోని ఉదయగిరి, పెంచలకోన, మైపాడు, ఇసుకపల్లి, రామాయపట్నం బీచ్‌లో లైట్‌హౌస్, జొన్నవాడ మల్లి కార్జున స్వామి ఆలయం, నరసింహకొండ, మాలకొండ, తల్పగిరి రంగనాథస్వామి ఆలయం, కండలేరు డ్యామ్, సోమశిల తదితర ప్రాంతాలను చిత్రీకరించి ఆన్‌లైన్‌లో పంపాలని పేర్కొన్నారు. విజేతలకు రూ.15వేలు, రూ.10వేలు, రూ.5 వేల చొప్పున బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు జిల్లా పర్యాటక అధికారి శ్రీనివాసరావు, 98480 07024ను సం ప్రదించాలని తెలిపారు.

ప్రభుత్వం మారినా ఆర్‌అండ్‌బీ శాఖలో మార్పు రానంటోంది. టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్లు పనులు మొదలుపెట్టాలని కూటమి ప్రభుత్వం ఆదేశించినా కొంతమందిలో ఆ బాధ్యత కనిపించడం లేదు. కీలకమైన రహదారిగా నెల్లూరు-మైపాడు రోడ్డును గుర్తించిన కేంద్ర ప్రభుత్వం సదరు రోడ్డు అభివృద్ధికి గతేడాది రూ.48 కోట్లు కేటాయించింది. టెండర్లు పూర్తయి అగ్రిమెంట్ జరిగి ఆరు నెలలు పూర్తి కావస్తోంది. మొన్నటి వరకూ ఎన్నికల కోడ్ ఉందంటూ నెట్టుకొచ్చిన అధికారులు, కాంట్రాక్టర్.. ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడి మూడు నెలలు కావస్తున్నా ఇంతవరకూ ఆ రోడ్డు పనులు మొదలుపెట్టలేదు.

నిధులున్నా నీరసం!

- కీలకమైన మైపాడు రోడ్డుకు రాజకీయ గ్రహణం
- అభివృద్ధికి రూ.48 కోట్లిచ్చిన కేంద్ర ప్రభుత్వం
- టెండర్‌లో రింగ్.. భాగం పంచుకున్న కాంట్రాక్టర్లు
- అగ్రిమెంట్ పూర్తయి ఆరునెలలైనా ప్రారంభం కాని నిర్మాణం
- అధికారులు పట్టించుకోరు.. కాంట్రాక్టర్ స్పందించరు
- ఇప్పుడు ఆ వర్క్‌ను మరొకరు తీసుకునే ప్రయత్నాలు

నెల్లూరు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పర్యాటక ప్రదేశాల్లో మైపాడు బీచ్ ప్రధానమైంది. నెల్లూరు నగరవాసులకు కూడా ఈ బీచ్ ఒక విహారస్థలంగా ఉంటుంది. అయితే నెల్లూరు నుంచి మైపాడు వెళ్లే రహదారి మాత్రం దారుణంగా ఉంది. డెల్టా ప్రాంతాన్ని కలుపుకుంటూ వెళ్లే ఈ రహదారి ప్రస్తుతం సింగిల్ లేన్ కావడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. నెల్లూరులో మైపాడు రోడ్డును డబుల్ లేన్ రోడ్డుగా విస్తరించారు. కానీ జాతీయ రహదారి నుంచి మైపాడు వరకు ఉన్న సుమారు 22 కిలోమీటర్లు మాత్రం ఇంకా ఇబ్బందికరంగానే ఉంది. దీన్ని విస్తరించి అభివృద్ధి చేస్తే మార్గమధ్యంలోని గ్రామాల ప్రజలకు, బీచ్‌కు వెళ్లే పర్యాటకులకు ఉపయుక్తంగా ఉంటుందని కేంద్ర ప్రభుత్వం భావించింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రతిపాదనలు వెళ్లగానే సీఆర్ఐఎఫ్ కింద రూ.48 కోట్లు కేటాయించింది.

నాడు రింగ్.. నేడు లాగేసుకునే ప్రయత్నాలు

నెల్లూరు-మైపాడు రోడ్డుకు సంబంధించి గతేడాది చివర్లో ఆర్‌అండ్‌బీ అధికారులు టెండర్లు పిలిచారు. మొత్తం ఐదుగురు కాంట్రాక్టర్లు ఈ వర్కు కోసం టెండర్లు దాఖలు చేశారు. అప్పటి వరకూ టెండర్లు వేసేందుకు ఆసక్తి చూపని కాంట్రాక్టర్లు.. ఇది కేంద్ర ప్రభుత్వ వర్కు కావడంతో బిల్లులు వస్తాయని పోటీ పడ్డారు. అయితే రివర్స్ టెండరింగ్ సమయం నాటికి అందరూ రింగ్ అయినట్లు నాడు ప్రచారం జరిగింది. 2.40 శాతం ఎక్సెస్‌కు ఓ కాంట్రాక్టర్ వర్కును దక్కించుకోవడమే ఇందుకు నిదర్శనంగా చెబుతున్నారు. ఐదుగురు కాంట్రాక్టర్లు టెండర్లు వేసినప్పటికీ వీరు రివర్స్ టెండరింగ్‌లో పాల్గొనలేదు. తెరవెనుక వీరంతా ఒప్పందం కుదుర్చుకొని తలా కొంత వర్కును అనధికారికంగా విభజించుకున్నట్లు తెలుస్తోంది. బ్యాంకు గ్యారెంటీలను పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమవుతుందని ఆర్‌అండ్‌బీ వర్గాలు చెబుతుండడం గమనార్హం. ఓ కాంట్రాక్టర్ పేరుపై అగ్రిమెంట్ జరగ్గా ఆ కాంట్రాక్టర్ ఖాతా నుంచి సగం బ్యాంకు గ్యారెంటీను, మరో కాంట్రాక్టర్ ఖాతా నుంచి మిగిలిన సగం మొత్తం బ్యాంక్ గ్యారెంటీను సమర్పించినట్లు సమాచారం. పోనీ అందరూ రింగ్ అయినా పనులు ప్రారంభించారా? అంటే అదీ లేదు. తాజాగా ఈ వర్కును పూర్తిగా దక్కించుకునేందుకు ఓ కాంట్రాక్టర్ తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. మొదట్లో కొంతభాగం తీసుకున్న సదరు కాంట్రాక్టర్ ఇప్పుడు మొత్తం వర్కు తనకే కావాలని పట్టుబడుతుండటంతో సమస్య జఠిలమవుతున్నట్లు కాంట్రాక్టర్ల వర్గాల ద్వారా తెలుస్తోంది. ఈ నేపథ్యంలో అసలు పనులు ఎప్పుడు మొదలవుతాయన్న ప్రశ్న తలెత్తుతోంది.



నెల్లూరు నుంచి మైపాడుకు వెళ్లే రోడ్డు

మేమున్నామనీ..

వరద బాధితులకు విరివిగా విరాళాలు

నెల్లూరు (హరనాథపురం), సెప్టెంబరు 9 : వరదలో చిక్కుకున్న ఆపన్నహస్తంకోసం ఎదురుచూస్తున్న ఎందరో అభాగ్యులకు నెల్లూరువాసులు మేమున్నామంటున్నారు. నగదుతోపాటు ఆహార ప్యాకెట్లు, మంచినీటి సీసాలతోపాటు ఇతర తినుబండారాలను సేకరించి విజయవాడకు తరలిస్తున్నారు. ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి చిన్న కుమారుడు మాగుంట నిఖిల్‌రెడ్డి రూ.5 లక్షల విరాళం ప్రకటించారు. ఈ మేరకు చెక్కును సోమవారం నెల్లూరులోని కలెక్టరేట్‌లో కలెక్టర్ ఆనంద్‌కు అందజేశారు. అలాగే, ఏపీఎన్జీఓ అసోసియేషన్ జిల్లా నాయకులు కూడా సోమవారం కలెక్టర్‌కు రూ.1,00,116 చెక్కును అందచేశారు. ఈ కార్యక్రమంలో ఆ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మన్నేపల్లి పెంచలరావు, నేతలు బి. వెంకటేశ్వర్లు, ఎస్.ఆంజనేయవర్మ, జి. రామకృష్ణ, మధు తదితరులు పాల్గొన్నారు.

● కావలి రెడ్‌క్రాస్ విపత్తు విభాగ కన్వీనర్ బీద లక్ష్మీనంద నాయకత్వంలో రూ.1.10 లక్షల విలువైన మందులను విజయవాడకు చేరవేసింది.

● బుచ్చిరెడ్డిపాళెం : మెప్మా ఎండీ సహాయనిధికి సిబ్బంది రూ.59 వేలు అందజేశారు. అలాగే నిత్యావసర సరుకులు, వాటర్‌బాటిళ్లు, బిస్కెట్లను మెప్మా పీడీ రవీంద్రకు అందజేయగా సీఈఓ నర్మద, హర్షిత, ఆర్పీలను అభినందించారు.



కలెక్టర్‌కు విరాళం చెక్కును అందచేస్తున్న మాగుంట నిఖిల్ రెడ్డి

హెల్పింగ్ హ్యాండ్స్



కలెక్టర్ ఆనంద్‌కు చెక్కు ఇస్తున్న ఎన్జీవో సంఘం నాయకులు

నెల్లూరు రైల్వే స్టేషన్‌కు న్యూ లుక్!




తూర్పువైపు నుంచి ప్లాట్‌ఫాంపైకి అండర్‌పాస్



ప్లాట్‌ఫాంపై ప్రయాణికుల కోసం కొత్తగా నిర్మిస్తున్న షెడ్డు

నెల్లూరు రైల్వే స్టేషన్ రూపు రేఖలు మారుతున్నాయి. పెద్ద స్టేషన్‌కు కొత్త హంగులు సమకూరుతున్నాయి. కేంద్ర ప్రభుత్వ పునరాభివృద్ధి పథకంలో భాగంగా రూ.102 కోట్లతో చేపట్టిన నూతన నిర్మాణాల పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. నిత్యం 30 వేల మంది ప్రయాణికులతో రద్దీగా ఉండే నెల్లూరు రైల్వే స్టేషన్ స్టేజ్-3 విభాగంలో ఉంది. వందల రైళ్లు ఈ స్టేషన్‌లో ఆగి వెళుతున్నాయి. తద్వారా దక్షిణ మధ్య రైల్వేలో అత్యధిక ఆదాయాన్నిచ్చే స్టేషన్లలో ఒకటిగా గుర్తింపు పొందింది. ఈ క్రమంలో ప్రయాణికులకు మరిన్ని సౌకర్యాలు కల్పించే దిశగా ఆధునిక భవనాలు రూపుదిద్దుకుంటున్నాయి. అన్నీ ప్లాట్‌ఫామ్‌లను కలుపుతూ సౌకర్యవంతమైన ఫుట్‌ఓవర్ బ్రిడ్జి, అండర్‌పాస్, ప్రయాణికులు వేచి చూసేందుకు షెడ్లు, స్టేషన్‌కు తూర్పు, పడమర దిక్కులలో కమర్షియల్ కాంప్లెక్స్‌లు నిర్మిస్తున్నారు. నీటి ఎద్దడి లేకుండా చూసేందుకు అండర్‌గ్రౌండ్ వాటర్ స్టోరేజ్ ట్యాంక్, ఎస్కలేటర్లు, వెయిటింగ్ హాళ్లు, మరుగుదొడ్లు సిద్ధమవుతున్నాయి. నూతనంగా ఎల్‌ఈడీ దీపాలతో స్టేషన్ పరిసరాలను మరింత కాంతివంతం చేస్తున్నారు. రైల్వే పోలీసు స్టేషన్‌కు, న్యాయస్థానానికి కొత్త భవంతులు రూపుదిద్దుకుంటున్నాయి. మరో రెండు, మూడు మాసాల్లో ఈ పనులన్నీ పూర్తయ్యే అవకాశం ఉంది.

- నెల్లూరు (వెంకటేశ్వరపురం)

పెద్ద స్టేషన్‌లో కొత్త హంగులు




సరికొత్తగా సిద్ధమవుతున్న ఫుట్‌ఓవర్ బ్రిడ్జి, కమర్షియల్ కాంప్లెక్స్

వివాహేతర సంబంధం వల్లే హత్య

● ఐదుగురి అరెస్టు ● మారణాయుధాల స్వాధీనం : కావలి డీఎస్పీ



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకటరమణ, సీఐ, ఎస్ఐ తదితరులు

కావలి, సెప్టెంబరు 9: దగదర్తి మండలం ఐతంపాడు-రంగసముద్రం మధ్య పొలాల్లో ఈనెల ఒకటిన జరిగిన నాగులూరి ప్రభయ్య(35) హత్య కేసులో సంగం మండలం పెరమనకు చెందిన ఎనిమిదిమంది నిందితుల్లో ఐదుగురిని సోమవారం దగదర్తి పోలీసు స్టేషన్ సమీపంలో అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి కత్తి, రాడ్లు, కర్రలు, రెండు మోటారు సైకిళ్లు స్వాధీన పరుచుకున్నట్లు కావలి డీఎస్పీ ఎం. వెంకటరమణ తెలిపారు. సీఐ పాపారావు, దగదర్తి ఎస్ఐ జంపాని కు మార్‌లతో కలిసి స్థానిక డీఎస్పీ కార్యాలయంలో సోమవారం సాయంత్రం డీఎస్పీ విలేకరుల తో మాట్లాడుతూ నిందితుల వివరాలను వెల్లడించారు. ఏఎస్‌పేట మండలం గుడిపాడుకు చెందిన ప్రభయ్య సమీప బంధువు అయిన ఓ మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకు న్నాడు. ఆమెకు వివాహం చేసినా సంబంధం కొనసాగిస్తుండటంతో ఆమె భర్త వదిశాడు. మళ్లీ రెండో వివాహం చేసినా ఆమె వివాహేతర సంబంధాన్ని కొనసాగుతుండటంతో ఆయ న కూడా వదిలేశాడు. దీంతో ఆ మహిళ సోదరుడు గురునాథం మధు అవమానానికి గురై పలు పర్యాయాలు ప్రభయ్యను మందలించాడు. అయినా ఆయనలో మార్పు రాలేదు. దీంతో మధు తన బంధువులతో మాట్లాడి ఎలాగైనా ప్రభయ్యను హతమార్చాలని నిర్ణయించుకున్నా డు. పందులను పట్టుకుని దొంగతనంగా అమ్ముకుంటున్న ప్రభయ్యతో మంచిగా ఉంటూ, ఈనెల ఒకటిన దగదర్తి మండలం ఐతంపాడు-రంగసముద్రం గ్రామాల మధ్యకు పిలిచి పూటుగా మద్యం తాపించి, పథకం ప్రకారం కత్తితో పొడిచి రాడ్లు, కర్రలతో దాడిచేసి హత్య చేశారు. కావలి సీఐ పాపారావు కేసు దర్యాప్తులో భాగంగా ఎస్ఐ జంపాని కుమార్‌తో కలిసి సోమవారం నిందుతులను అరెస్ట్‌చేశారు. అరెస్ట్ అయిన వారిలో గురునాథం మధు, గురునాథం రవి, గురునాథం సురేంద్ర, గురునాథం మహేంద్ర, గురునాథం తిరుపతమ్మ ఉన్నారు. మరో ముగ్గురు నిందితులయిన గురునాథం బలరామయ్య, గురునాథం బాలరాజు, గురునాథం దశయ్య పరారీలో ఉన్నారని, వారిని కూడా త్వరలో అరెస్టు చేస్తామని డీఎస్పీ తెలిపారు.

గుర్తుతెలియని యువకుడి మృతి



నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 9: అనారోగ్యంతో జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ గుర్తుతెలియని యువకుడు(25) ఆదివారం మృతి చెందాడు. ఈ ఘటనపై సోమవారం దర్గామిట్ట పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. మృతుడి వివరాల కోసం పోలీసులు ఆరాతీస్తున్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు దర్గామిట్ట పోలీసు స్టేషన్ 0861-2328440, 9440700018కు సమాచారం అందించాలని ఇన్‌స్పెక్టర్ రోశయ్య కోరారు.

రైలు పట్టాలపై మరొకరు..

బిట్రగుంట, సెప్టెంబరు 9: బిట్రగుంట రైల్వేసెక్షన్ పరిధిలోని తలమంచి- అల్లూరు రోడ్డు రైల్వేస్టేషన్ల మధ్య సోమవారం ఓ యువ కుడి మృతదేహాన్ని గుర్తించినట్లు కావలి రైల్వే పోలీసులు తెలిపారు. మృతదేహం ఉన్న పరిస్థితిని బట్టి చూస్తే ఉదయం గుర్తు తెలియని రైల్లోంచి ప్రమాదవశాత్తు జారిపడి మృతిచెంది ఉండవచ్చని రైల్వే కానిస్టేబుల్ వెంకటేశ్వరావు తెలిపారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారా లు దొరకలేదన్నారు. మృతదేహాన్ని కావలి ఏరియా వైద్యశాలకు తరలిం చి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

వైసీపీ కార్పొరేటర్ భర్త వీరంగం

● మాజీ ఎమ్మెల్యే మేనల్లుడిపై దాడి ● పోలీసులకు బాధితుడి ఫిర్యాదు

నెల్లూరు(క్రైం) : నెల్లూరులోని 38వ డివిజన్ కార్పొరేటర్ భర్త దాసరి రాజేష్ సోమవారం మద్యం మత్తులో వీరంగం సృష్టించి ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్యనాయుడు మేనల్లుడు విజయరాజేంద్రప్రసాద్‌పై దాడికి పాల్పడ్డారు. ఈ మేరకు బాధితుడు చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడు, నాయకుల కథనం మేరకు.. విజయరాజేంద్రప్రసాద్ సోమవారం మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో సోధన్‌నగర్‌లో తాను ఏర్పాటు చేసిన వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ పిలుపు మేరకు వనం మనం కార్యక్రమం చేపట్టారు. ఆ ప్రాంతంలో గ్రీనరీ డెవలెప్ చేయాలన్న సంకల్పంతో మొక్కలు నాటి వాటిని సంరక్షించుకునేందుకు ఫెన్సింగ్‌లు ఏర్పాటు చేయిస్తున్నారు. వీటిని త్వరలో రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ద్వారా ప్రారంభింప చేయాలని భావించారు. ఈ క్రమంలో కార్పొరేటర్ భర్త దాసరి రాజేష్ అక్కడికి చేరుకుని తన భార్య కార్పొరేటర్‌గా ప్రాతినిధ్యం వహిస్తున్న డివిజన్‌లో తనకు తెలియకుండా ఎలా మొక్కలు నాటుతారంటూ వీరంగం సృష్టిస్తూ రాజేంద్రప్రసాద్‌పై దాడికి పాల్పడ్డాడు. గాయపడిన ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని చిన్నబజారు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. కాగా పోలీసు స్టేషన్ వద్దకు చేరుకున్న టీడీపీ నాయకురాలు, మాజీ మేయర్ నందిమండలం భానుశ్రీ మాట్లాడుతూ కార్పొరేటర్ భర్త దాసరి రాజేష్ మద్యంమత్తులో దాడులకు పాల్పడడం సర్వసాధారణ మైందన్నారు. ఈ క్రమంలో ఇన్‌స్పెక్టర్ ఫోన్ చేస్తే నేను మద్యం సేవించి ఉన్నాను అందుకే దాడి చేశానని అంగీకరించారన్నారు.

జీవో నెంబరు115ను రద్దు చేయాలి

నెల్లూరు(వైద్యం), సెప్టెంబరు 9 : ప్రభుత్వం జీవో నెంబర్‌ను వెంటనే రద్దు చెయ్యాలంటూ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఎదుట స్టాఫ్‌నర్సులు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏపీఎస్ఆర్ మెడికల్ నర్సింగ్ కాంట్రాక్టు యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు వేణు, రూతుగ్రేస్ మాట్లాడుతూ నర్సింగ్ కోర్సు చేసిన వారికి 18 నెలల శిక్షణ ఇచ్చి రిజిస్టర్ నర్సులుగా మిడ్‌వైఫరీలుగా గుర్తిచేందుకు ఈ జీవో జారీ చేసిందన్నారు. దీని ద్వారా ప్రభుత్వ ఆసుపత్రుల్లో స్టాఫ్‌నర్సులుగా వేస్తుందన్నారు. ఇప్పటికే 15 ఏళ్లుగా ప్రభుత్వ ఆసుపత్రులలో కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేస్తున్న స్టాఫ్‌నర్సులను రెగ్యులర్ చేయకుండా ఏఎన్‌ఎంలకు అవకాశం ఇవ్వడం అన్యాయమన్నారు. మూడున్నరేళ్ల జీఎన్‌ఎం, నాలుగున్నరేళ్ల బీఎస్‌ఈ నర్సింగ్, రెండేళ్ల ఎంఎస్‌ఈ నర్సింగ్ చేసిన తాము స్టాఫ్‌నర్సులుగా బాధ్యతలు చేపడుతున్నామన్నారు. స్టాఫ్‌నర్సులకు మూడు ఉద్యోగోన్నతులు మాత్రమే ఉండగా ఏఎన్‌ఎంలకు సుపర్‌వైజర్లుగా, పీహెచ్‌ఎన్ పదోన్నతులు ఉన్నాయన్నారు. ఇవి కాక వారికి స్టాఫ్‌నర్సులుగా ఉద్యోగోన్నతులు ఇవ్వడం సరికాదన్నారు. కార్యక్రమంలో నాయకులు శరత్‌బాబు, మేరిమాధురి, రీనాకుమారి తదితరులు పాల్గొన్నారు.


నిరసన వ్యక్తం చేస్తున్న స్టాఫ్ నర్సులు

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	121
లేయర్ లైవ్	105
స్కిన్ చికెన్	220
స్కిన్‌లెస్	244
లేయర్	178

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.6866
వెండి కిలో ధర	రూ. 83,700
వెండి ఒక గ్రాము	రూ. 86.70

సీఎం కార్యాలయం నుంచి వచ్చే

అర్జీల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వండి

● ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ ఆనంద్


ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 9 : ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి, ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలు పరిష్కరించడంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ తిక్కన భవన్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి వారు చెప్పిన సమస్యలను క్షుణ్ణంగా విన్నారు. సంబంధిత అధికారులను పిలిపించి ఆయా సమస్యలను వెంటే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో కన్నమనాయుడు, డీపీవో సుస్మితారెడ్డి, రవాణా శాఖ ఉప కమిషనర్ చందర్, ఆర్టీసీ ఆర్‌ఎం విజయరత్నం, తదితరులు పాల్గొన్నారు.

● నెల్లూరు నగరం ఆటో నగర్‌లో ఉన్న మైనార్టీ గురుకుల పాఠశాలను అక్కచెరువుపాడులో నూతనంగా నిర్మించి భవనంలోకి మార్చాలని కోరుతూ ముస్లిం ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నాయకులు జియావుల్లా హక్, సయ్యద్ సమి, మౌలానా అజీజ్, ఆసీఫ్ పాషా తదితరులు కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ప్రస్తుతం అద్దె భవనంలో ఉన్న గురుకులంలో కనీస వసతులు లేవన్నారు. కాలుష్యంతో విద్యార్థులు అల్లాడుతున్నారన్నారు.

● జిల్లాలో ధాన్యం ధరలు తగ్గి పోకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ రైతు సంఘాల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు చిరసాని కోటిరెడ్డి కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కోటిరెడ్డి మాట్లాడుతూ ధాన్యం మద్దతు ధర పుట్టి రూ.18,700 ఉండగా మార్కెట్‌లో రూ.17వేలకు కొంటుండడం దారుణమన్నారు. అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలన్నారు.

● గిరిజన ఉద్యోగి చలంచర్ల సాయిబాబాకు న్యాయం చేయాలని కోరుతూ యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసీ పెంచలయ్య కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సాయిబాబా ఉద్యోగ విరమణ, ఎస్ఆర్ విషయం కలెక్టర్‌కు తెలియచేయగా ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు.

విచారించి పరిష్కరించండి

● పోలీసు అధికారులకు ఎస్పీ ఆదేశం

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 9: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదులపై సమగ్రంగా విచారించి పరిష్కరించాలని పోలీసు అధికారులను ఎస్పీ జీ కృష్ణకాంత్ ఆదేశించారు. నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 80 మంది నుంచి ఎస్పీ వినతులు స్వీకరించి బాధితులతో నేరుగా మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, లీగల్ అడ్వైజర్ శ్రీనివాసులరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ కృష్ణకాంత్

ప్రభుత్వ భూమేగా... చేసేయ్ కబ్జా!

కలువాయి, సెప్టెంబరు 9: మండలంలో ఎక్కడైన కాస్త ప్రభుత్వ భూమి ఖాళీగా కనిపిస్తే చాలు కబ్జా చేసేస్తున్నారు. తాజాగా చింతలపాళెం గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నెం.157లోని ఐదు ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తుతెలియని వ్యక్తులు కబ్జా చేశారు. ఈ భూమిని యంత్రాలతో చదును చేసి, ట్రాక్టరుతో దున్ని పెట్టారు. ఈ విషయాన్ని గ్రామస్థులు ఆలస్యంగా గుర్తించి రెవెన్యూ అధికారులకు సమాచారం ఇవ్వడంతో ఈ ఆక్రమణ బాగోతం వెలుగులోకి వచ్చింది. ఇప్పటికీ ఈ భూమిని ఆక్రమించింది ఎవరో తెలియడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. గ్రామ సర్వే నెం.157లో 20ఎకరాలకుపైగా ప్రభుత్వ భూమి ఉంది. ఇందులో సోమశిల కండలేరు వరద కాలువ నిర్మాణానికి కొంత భూమి కేటాయించారు. మిగిలిన భూమిలో అసైన్‌మెంటు పట్టాలు కూడా ఇచ్చారు. ఇదంతా పోను ఇక 5 ఎకరాలు మిగిలింది. ఈ భూమి మీద కన్నేసిన అక్రమార్కులు గుట్టచప్పుడు కాకుండా పొలం తయారు చేసి ఆక్రమించారు. ఈ విషయమై రెవెన్యూ అధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకుని ప్రభుత్వ భూమిని కాపాడాలని గ్రామస్థులు కోరుతున్నారు.



ఆక్రమించింది ఎవరో తెలియడం లేదు

ఈ విషయం వీఆర్వో జనార్దన్ దృష్టికి తీసుకుపోగా.. పొలం ఆక్రమించి ఉన్నారు. దీనిపై విచారిస్తున్నాను. ఆక్రమించింది ఎవరనే విషయం ఇంకా నాకూ తెలియడం లేదని చెప్పారు.

మూడు ప్రాంతాల్లో నేడు మెగా జాబ్‌మేళా

● జిల్లా ఉపాధి అధికారి వినయ్‌కుమార్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట), సెప్టెంబరు 9: జిల్లా ఉపాధి కార్యాలయంలో ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీ (మంగళవారం) ఉదయం 10.30 గంటలకు జిల్లాలోని మూడు ప్రాంతాల్లో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని జిల్లా ఉపాధి అధికారి వినయ్‌కుమార్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నెల్లూరు నగరంలోని డీకేడబ్ల్యూ కళాశాల, ఓల్డ్‌చెక్‌పోస్టు వద్ద ఉన్న ఎన్‌ఏసీ కార్యాలయం, కావలి ఆర్టీసీ బస్టాండు పక్కన ఉన్న పాత ఆర్‌అండ్‌బీ కార్యాలయ భవనంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కెఎల్ గ్రూప్-అమేజాన్ (చెన్నై), ముత్తూట్ ఫైనాన్స్ లిమిటెడ్, సూళ్లూరుపేటలోని కాంటినెంటల్ కాఫీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, క్రెడిట్ యాక్సిస్ గ్రామీన్ లిమిటెడ్, రిలయన్స్ రిటైల్ లిమిటెడ్, చిత్తూరులోని అమర్‌రాజా బ్యాటరీస్ సంస్థల్లో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు జరుగాతాయని పేర్కొన్నారు. ఈ జాబ్ మేళాలను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

వన్ టైం ప్రాక్టికల్ అవకాశం కల్పించాలి

● వర్సిటీ వీసీకి టీఎన్‌ఎస్‌ఎఫ్ వినతి

వెంకటాచలం, సెప్టెంబరు 9: విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలో ఉన్న పీజీ, లా విద్యార్థులకు వన్ టైం ప్రాక్టికల్ ఆపర్చునిటీ అవకాశం కల్పించాలని టీఎన్‌ఎస్‌ఎఫ్ నగర అధ్యక్షుడు పఠాన్ ఆషిక్ అలీఖాన్ కోరారు. ఈమేరకు వీఎస్‌యూలో సోమవారం వర్సిటీ వీసీ డాక్టర్ సారంగం విజయ భాస్కర్‌రావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ వీఎస్‌యూ అనుబంధ పీజీ, లా కళాశాలలో ఏళ్ల తరబడి ఇంటర్నల్ ప్రాక్టికల్స్‌కు సంబంధించిన విద్యార్థి హాజరుకాని పక్షంలో మరలా ఆ ఇంటర్నల్ ప్రాక్టికల్స్‌ను నిర్వహించకూడదని యూనివర్సిటీ నియమ నిబంధనలని చెప్పి విద్యార్థుల భవిష్యత్తును కాలరాస్తున్నారన్నారు. కానీ వెంకటేశ్వర యూనివర్సిటీలో తగు మొత్తం అపరాధ రుసుము చెల్లించినట్లయితే మరలా విద్యార్థి హాజరుకాని ప్రాక్టికల్స్ పరీక్షలను నిర్వహించే వెసులుబాటు ఉందని, అలాంటి వెసులుబాటు వీఎస్‌యూలో కూడా కల్పించాలని కోరారు. దీంతో త్వరలో విద్యార్థులకు ఉపయోగపడే విధంగా తగు చర్యలు తీసుకుంటామని వీసీ హామీ ఇచ్చినట్లు ఆషిక్ తెలిపారు.

తల్లి చెంతకు చంటిబిడ్డ

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 9 : నెల్లూరు ఆర్టీసీ బస్టాండ్‌లో దొరికిన మూడు నెలల పసికందును సోమవారం ఐసీడీఎస్ అధికారులు తల్లి చెంతకు చేర్చారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఇటీవల గుర్తుతెలియని వ్యక్తులు మూడు నెలల పసికందును బస్టాండ్‌లో వదిలి వెళ్లారు. సాయంత్రం వరకు చూసినా ఆ బిడ్డ కోసం ఎవరూ రాకపోవడంతో సమాచారం అందుకున్న జిల్లా బాలల సంరక్షణాధికారి బి.సురేష్ పోలీసులకు సమాచారం అందజేసి ఆ బిడ్డను శిశు గృహకు తరలించారు. ఈ క్రమంలో సోమవారం నెల్లూరుకు వచ్చిన పసికందు తల్లిదండ్రులు ఉలవపాడు మండలం కరేడుకు చెందిన ఈగ రమాదేవి, భర్త సుధాకర్‌లు తమ బిడ్డ కోసం ఆర్టీసీ బస్టాండ్‌లో ఆరా తీశారు. దీంతో ఆర్టీసీ సిబ్బంది వారిని విచారించి ఐసీడీఎస్ అధికారుల వద్దకు పంపారు. వారిని ఐసీడీఎస్ అధికారులు విచారించగా తన బిడ్డను ఆర్టీసీ బస్టాండ్‌లో బల్లపై పడుకోబెట్టి తాను తలతిరిగి పడిపోయనని, స్పృహ వచ్చాక బిడ్డ కనిపించకపోవడంతో ఆత్మకూరులోని బంధువుల ఇంటికి వెళ్లానన్నారు. టీవీల్లో వచ్చిన వార్తలను చూసిన బంధువులు తన బిడ్డ నెల్లూరులో ఉందని చెప్పడంతో ఇక్కడికి వచ్చాననడంతో వారు శిశు గృహలో ఉన్న బిడ్డను చూపించగా వారి బిడ్డగా గుర్తించారు. దీంతో ఐసీడీఎస్ పీడీ హేనసుజన్ వారికి పసికందును అప్పగించారు. ఈ కార్యక్రమంలో డీసీపీయూ సిబ్బంది సమత, పెంచల లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


శిశువును తల్లికి అప్పగిస్తున్న ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్

జీతాలు ఎప్పుడిస్తారు?

- జీజీహెచ్‌లో పారిశుధ్య కార్మికులు, సెక్యూరిటీల ఆందోళన
- రెండు నెలలుగా అందని వేతనాలు
- 359 మంది చిరుద్యోగులకు అగచాట్లు



నెల్లూరు(వైద్యం), సెప్టెంబరు 9 : నెల్లూరులోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో పనిచేసే పారిశుధ్య కార్మికులు, సెక్యూరిటీ సిబ్బంది సకాలంలో వేతనాలు అందక నానా అగచాట్లు పడుతున్నారు. రెండు నెలల వేతన బకాయిలు పేరుకు పోవటంతో ఆ చిరుద్యోగులు ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతున్నారు.

ప్రభుత్వం జనరల్ ఆసుపత్రిలో 145 మంది పారిశుధ్య కార్మికులు, 100 మంది సెక్యూరిటీ సిబ్బంది పనిచేస్తున్నారు. ప్రభుత్వ వైద్య కళాశాలలో 54 మంది పారిశుధ్య కార్మికులు, 25 మంది సెక్యూరిటీ పనిచేస్తున్నారు. ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో 25 మంది పారిశుధ్య కార్మికులు, 10 మంది సెక్యూరిటీ పనిచేస్తున్నారు. ఇలా మొత్తం మొత్తం 359 మంది చిరుద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. గత ప్రభుత్వం పారిశుధ్య, సెక్యూరిటీ నిర్వహణను ఏజెల్ సంస్థకు అప్పగించింది. పారిశుధ్య కార్మికులకు రూ.16వేలు, సెక్యూరిటీలకు రూ.13500 వేతనం చెల్లిస్తున్నారు. మొత్తం 359 మందికి నెలకు రూ. 54 లక్షలు జీతంగా, నిర్వహణ కింద రూ. 26 లక్షలు కలిపి నెలకు రూ.80 లక్షలను ఏజెల్ సంస్థకు ప్రభుత్వం చెల్లించాల్సి ఉంటుంది. అయితే ఈ ఆర్థిక సంవత్సరంలో నిధులు విడుదల చేయకపోవడంతో వేతన బకాయిలు పేరుకున్నాయి. ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోతే నిబంధనల ప్రకారం ఏజెల్ సంస్థ మూడు నెలల పాటు స్వంతంగా జీతాలు చెల్లించాల్సి ఉంటుంది. ఆ ప్రకారం ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించి ఆ సంస్థ చెల్లింపులు చేసింది. అయినా నిధులు అందకపోవడంతో కాంట్రాక్ట్ సంస్థ చేతులెత్తేసింది. గత వైసీపీ ప్రభుత్వం పెట్టిన బకాయిలు కూడా టీడీపీ ప్రభుత్వమే చెల్లించాల్సి వస్తోంది. ఈ క్రమంలో కొద్ది కొద్దిగా ఏజెల్ సంస్థకు నిధులు విడుదల చేస్తున్నా ప్రస్తుతం రెండు నెలల బకాయిలు నిలిచి పోయాయి. దీంతో జూలై, ఆగస్టు నెలల జీతాలు అందక కార్మికులు, సెక్యూరిటీ సిబ్బంది తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఇటీవల జీజీహెచ్ సూపరింటెండెంట్‌ను కలిసి తమకు వేతనాలు చెల్లించేలా సహకరించాలని వేడుకున్నారు.

కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

గంగ ఒడికి గణనాథుడు

● వైభవంగా నిమజ్జన ఊరేగింపులు, గ్రామోత్సవాలు ● పలుచోట్ల లడ్డూల వేలం

వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా మూడోరోజు సోమవారం పలుచోట్ల గణపతి విగ్రహాలను నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా చిన్నారులు, యువత, మహిళలు ఉత్సాహంగా ఊరేగింపు, గ్రామోత్సవంలోనూ పాల్గొన్నారు. పలుచోట్ల లడ్డూలను వేలం వేశారు. నీటి వనరులైన చెరువులు, కాలువలు, సముద్రంలో లంబోదరుడిని నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా డీజే సౌండ్స్, బాణాసంచా కాల్పులు, కేరింతల మధ్య వినాయక విగ్రహాలను తరలించారు. జిల్లా వ్యాప్తంగా జరిగిన కార్యక్రమాల వివరాలు..




కలిగిరి : నిమజ్జనానికి తరలివెళ్తున్న వినాయకుడు, కొండాపురం : భీమవరప్పాడులో వినాయక నిమజ్జనంలో భక్తులు



ఉలవపాడు : అలగాయపాలెం సముద్రంతీరంలో గణేష్ విగ్రహాలను నిమజ్జనం చేస్తున్న భక్తులు



జలదంకి : నిమజ్జనానికి బయలుదేరిన వినాయకులు



కందుకూరు : నిమజ్జనానికి తరలుతున్న గణనాథుడి విగ్రహం

కావలిటౌన్, సెప్టెంబరు9: పట్టణ పరిధిలోని పలు విగ్రహాలు సోమవారం తీరంలో నిమజ్జనానికి తరలివెళ్లాయి. యువత, చిన్నారులు, మహిళలు ట్రాక్టర్లు, మినీ లారీలు తదితర వాహనాల్లో తీరానికి వెళ్లారు. రంగులు చల్లుకుంటూ, బాణాసంచా కాల్చుకుంటూ, యువత చిందులు వేస్తూ నినాదాలు చేసుకుంటూ నిమజ్జనం నిర్వహించారు. బ్రిడ్జి కూడలిలో భగత్‌సింగ్ గణేష్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రజలందరికి వినాయకుడి ఆశీర్వాదం లభించాలని ఎమ్మెల్యే దగుమాటి కృష్ణారెడ్డి పేర్కొన్నారు. రాఘవేంద్ర కాలనీలో ఎమ్మెల్యే నివాసం సమీపంలో కాలనీవాసులు నిర్వహించిన నిమజ్జనోత్సవాన్ని సోమవారం ఎమ్మెల్యే దంపతులు పూజలు నిర్వహించి టెంకాయ కొట్టి ప్రారంభించారు. కళాకారుల విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కాగా పట్టణంలోని మరికొన్ని విగ్రహాలను ఐదు, తొమ్మిదవ రోజున నిమజ్జనం చేయనున్నారు.

కలిగిరి : మూడురోజులుగా భక్తుల నుంచి పూజలందుకున్న మండలంలోని వినాయక విగ్రహాలు సోమవారం నిమజ్జనానికి బయలుదేరాయి. చలువ పందిళ్ల కింద కొలువుదీరిన గణనాథుడి విగ్రహాలను భక్తులు ఆటోలు, ట్రాక్టర్లపై ఉంచి గ్రామోత్సవం నిర్వహించి కావలి సమీపంలోని తుమ్మలపెంట సముద్ర తీరానికి తరలించారు. విగ్రహాల వెంట యువత, చిన్నారులు, మహిళలు పెద్ద సంఖ్యలో వెళ్లారు.

ఉలవపాడు : గణపతి విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు సోమవారం రామాయపట్నం, అలగాయపాలెం, చాకిచర్ల సముద్రతీరానికి భక్తులు విగ్రహాలను తరలించారు. ఉలవపాడు, గుడ్లూరు మండలాల్లో ప్రతిష్ఠించిన గణనాథుడి విగ్రహాలను గ్రామాల్లో ఊరేగిస్తూ, బాణాసంచా పేలుస్తూ, రంగులు చల్లుకుంటూ తీరానికి చేర్చి నిమజ్జనం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, ప్రమాదాలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. నిమజ్జనాలు మరో మూడునాలుగు రోజుల వరకు కొనసాగనున్నాయి.

కొండాపురం : గ్రామాల్లో ఏర్పాటు చేసిన గణనాథుల విగ్రహాల నిమజ్జనం సోమవారం ఘనంగా జరిగాయి. మూడవరోజు అన్నదానం, ఉట్టికొట్టడం, యువతకు ఆటలపోటీలు నిర్వహించిన నిర్వాహకులు విజేతలకు బహుమతులు అందచేశారు.గణనాథుడి దగ్గర ఉంచిన లడ్డూనూ వేలం చేశారు. గుడవళ్లూరు, ఆదిమూర్తిపురం, భీమవరప్పాడు తదితర గ్రామాల్లో వినాయక విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన వాహనాలలో ఉంచి నిమజ్జనాలకు తరలించారు. మండల పరిధిలో 42 వినాయక విగ్రహాల నిమజ్జనాలు జరిగాయని ఎస్‌ఐ మహేంద్ర తెలిపారు.

జలదంకి : సోమవారం గణేషుడి విగ్రహాల నిమజ్జనాలు కోలాహలంగా జరిగాయి. మండలంలో వందలాది విగ్రహాలను పురవీధుల్లో ఊరేగింపు జరిపారు. ఈ ఊరేగింపుల్లో యువకులు నృత్యాలు చేస్తూ రంగులు చల్లుకుంటూ కేరింతలు కొట్టారు. అనంతరం విగ్రహాలను కావలిరూరల్ మండలంలోని సముద్రతీరానికి చేర్చి అక్కడ నిమజ్జనం చేశారు.

కావలి రూరల్ : మూడవరోజు సోమవారం గంగమ్మ చెంతకు గణపయ్యలను చేర్చి ఘనంగా నిమజ్జనం చేశారు. మండలంలోని తుమ్మలపెంట, కొత్తసత్రం, పెదపట్టపుపాలెం సముద్రతీరంలో నిమజ్జనాన్ని కోలాహలంగా నిర్వహించారు. తీరంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డీఎస్పీ వెంకటరమణ, రూరల్ సీఐ రాజేశ్వరరావు బందోబస్తును పర్యవేక్షించారు. ఒకటవ పట్టణ సీఐ ఫిరోజ్ బ్రిడ్జి సర్కిల్ లో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడకుండా చర్యలు చేపట్టారు. అలాగే రూరల్ సీఐ రాజేశ్వరరావు, ఎస్‌ఐ బాలక్రిష్ణ తీరం వెంబడి గస్తీ నిర్వహించారు.

లింగసముద్రం : మండలంలోని లింగసముద్రంతో పాలు పంచాయతీలోని అంబేడ్కర్‌నగర్, బలిజపాలెం, జంగంరెడ్డిపాలెం, పెంట్రాల, గంగపాలెం, చినపవని, పెదపవని, అన్నెబోయినపల్లి తదితర గ్రామాలలో గణనాథుడి విగ్రహాలను సోమవారం నిమజ్జనం చేశారు. సాయంత్రం నుంచి వినాయకుడి విగ్రహాలను యువకులు ట్రాక్టర్లపై ఉంచి డీజే సౌండ్లతో ఊరేగించారు. రాత్రికి రాళ్లపాడు ప్రాజెక్టు మన్నేరు, ఉప్పుటేరులలో విగ్రహాలను నిమజ్జనం చేశారు.

బిట్రగుంట : బోగోలు మండలంలో గణేషుడి విగ్రహాల నిమజ్జనం సోమవారం జరిగింది. పలు గ్రామాల్లో గణనాథుడి విగ్రహాల గ్రామోత్సవం అనంతరం తాటిచెట్లపాలెం సముద్ర తీరంలో నిమజ్జనం చేశారు. ఎస్సై భోజ్య, సిబ్బంది తీరం వెంబడి గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. సాయంత్రానికి 78కి పైగా విగ్రహాలను నిమజ్జనం చేశారు.

కందుకూరు : ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీలో గణపతి విగ్రహానికి ఎమ్మెల్సీ శ్రీకాంత్ దంపతులు తొలి పూజలు చేశారు. సోమవారం జరిగిన నిమజ్జనంలో కరస్పాండెంట్ కంచర్ల రామయ్యతోపాటు కుటుంబ సభ్యులు, టెక్నికల్ డైరెక్టర్ డాక్టర్ విజయ శ్రీనివాస్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



బిట్రగుంట : తాటిచెట్లపాళెం తీరంలో కోలాహలం

ఆత్మకూరు : పట్టణంలోని పలు కూడళ్లతో పాటు మండలంలోని గ్రామాల్లో ఏర్పాటు చేసిన విగ్రహాలను సోమవారం ఉత్సవ కమిటీ సభ్యులు ట్రాక్టర్లపై ఉంచి ఊరేగిస్తూ నిమజ్జనానికి తరలించారు. వినాయకునికి పూజలు, భజనలు, కోలాటాలు మధ్య విగ్రహాలు ముందుకు సాగాయి. పట్టణంలోని పంటవీధి, యాదవ వీధి, తోటవీధి, నాగేంద్రపురం, జేఆర్‌పేట, ఎల్ఆర్‌పల్లి, అరుంధతీయవాడ, హరిజనవాడ ప్రాంతాల్లో నిర్వహించిన లడ్డూ వేలం పోటాపోటీగా జరిగింది. సాయంత్రం నుంచి ప్రారంభమైన నిమజ్జనోత్సవం రాత్రి 10గంటలకు పైబడి కొనసాగింది. విగ్రహాలను అప్పారావుపాళెం సమీపంలోని పెన్నానది వద్దకు తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా డీఎస్పీ వేణుగోపాల్ ఆధ్వర్యంలో సీఐ గంగాధర్‌రావు, ఎస్‌ఐలు, పోలీస్ సిబ్బంది పటిష్ట ఏర్పాట్లు చేశారు.

సంగం: స్థానిక శివాజీ సెంటర్, వడ్డిపాళెం, తిరుమనతిప్ప కాలనీల్లో ఏర్పాటు చేసిన విగ్రహాలను ట్రాక్టర్‌లపై ఉంచి గ్రామోత్సవంగా వెళ్తూ పెన్నానదికి నిమజ్జనానికి తరలివెళ్లారు. శివాజీ సెంటర్ యువకులు మహారాష్ట్ర నుంచి తీసుకొచ్చిన కళాకారుల వాయిద్యాలు గ్రామస్థులను ఆకట్టుకున్నాయి. అదే విధంగా సంగం చుట్టు గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను నిమజ్జనానికి పెన్నానదికి తరలివచ్చారు. నది ప్రాంతంలో సీఐ వేమారెడ్డి పోలీసులతో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. నిమజ్జనానికి క్రేన్‌తోపాటు ఎక్స్‌కవేటర్ ఏర్పాటు చేసి పర్యవేక్షించారు.

● ఆరు కేజీల లడ్డూ రూ. 50,116లకు వేలం

కొరిమెర్ల గ్రామం శ్రీరామకృష్ణ ఆశ్రమం వద్ద ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద జరిగిన లడ్డూ వేలం రూ. 50,116లు పలికింది. గ్రామానికి చెందిన సూదులగుంట పెంచలరెడ్డి అనే రైతు 6కేజీల లడ్డూను అత్యధికంగా వేలం పాడి దక్కించుకున్నారు. కార్యక్రమంలో కొరిమెర్ల వినాయక యూత్, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఉదయగిరి రూరల్: పట్టణంలోని పలు కాలనీలతో పాటు గ్రామాల్లో కొలువుదీరిన వినాయక విగ్రహాలు నిమజ్జనానికి తరలాయి. ఈ సందర్భంగా ఉట్టి మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. యువత రంగులు చల్లుకొని కేరింతలు కొట్టారు. ఉదయగిరి పట్టణంలోని వాల్మీకివీధి, యాదవపాళెం తదితర ప్రాంతాల్లో నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. అనంతరం సమీపంలో ఉన్న నీటి వనరుల్లో విగ్రహాలను నిమజ్జనం చేశారు.

● వినాయక లడ్డూ వేలం రూ.1.35లక్షలు

ఏఎస్‌పేట: గుడిపాడులో వినాయకుడి 12కేజీల లడ్డూ వేలం నిర్వహించారు. ఇందులో గ్రామానికి చెందిన కాటం రవీంద్రరెడ్డి అత్యధింగా రూ.1.35 లక్షలు పాడి దక్కించుకున్నారు. మండలకేంద్రంలోని బస్టాండ్ సెంటర్‌లోని మండపంలో ఉత్సవ కమిటీ సభ్యులు భక్తులకు అన్నదానం చేశారు.

కలువాయి: మండలంలో గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని భక్తులు కోలాహలంగా నిర్వహించారు. పూజలు చేసిన అనంతరం పెన్నానదిలో నిమజ్జనం చేశారు. మేళ,తాళాలు, బాణసంచా కాల్చుతూ కోలాటాలు, డ్యాన్స్‌లు చేస్తూ విగ్రహాలను తరలించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



ఆత్మకూరు: నిమజ్జనానికి తరలివెళుతున్న గణనాథుడు



సంగం: గణేషుడి గ్రామోత్సవం



సీతారామపురంలో యువకుల కేరింత



లింగసముద్రం : చినపవనిలో వినాయక విగ్రహాన్ని ఊరేగిస్తున్న గ్రామస్థులు

సీతారామపురం: మండలంలోని పలు గ్రామాల గణనాథులు నిమజ్జనానికి తరలివెళ్లారు. పెద్ద ఎత్తున యువకులు, మహిళలు, పిల్లలు ఉత్సాహంగా డప్పు వాయిద్యాలతో మధ్య బాణాసంచా పేలుస్తూ రంగులు చల్లుకుంటూ సంతోషంగా ఊరేగింపుగా ముందుకు సాగారు. స్థానిక చెరువులో విగ్రహాలను పోలీసు బందోబస్తు మధ్య నిమజ్జనం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్‌ఐ తిరుమలరెడ్డి, ఏఎస్‌ఐ వెంకటసుబ్బయ్య చర్యలు తీసుకున్నారు.

అనంతసాగరం: అన్నిగ్రామాల్లో వినాయక విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేసి అనంతరం ఉట్టి మహోత్సవం నిర్వహించి అనంతసాగరం చెరువులో నిమజ్జనం కోసం తరలించారు. పోలీసులు భద్రతా చర్యలు చేపట్టారు.

వరికుంటపాడు: పామూరుపల్లి, గొల్లపల్లి, జీ.కొండారెడ్డిపల్లి, తోటలచెరువుపల్లి, కాంచెరువు, దక్కనూరు, తూర్పుబోయమడగల తదితర గ్రామాల్లో నిర్వాహకులు విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు. మహిళలు దారిపొడవునా వారు కడవలతో నీరు పోసి కాయకర్పూరం అందజేసి మొక్కులు తీర్చుకున్నారు. పామూరుపల్లిలో తెల్లగొర్ల సునీల్‌కుమార్ దంపతులు రూ.69వేలకు లడ్డూను వేలంలో దక్కించుకున్నారు. తెల్లగొర్ల సుధీర్‌బాబు రూ.20వేలకు కలషం, రెడ్లదిన్నెలో పోలయ్య రూ.15,500కు ప్రమిదలను స్వంతం చేసుకున్నారు. అలాగే కాంచెరువు బీసీకాలనీలో ఆలా మాధవరావు రూ. రూ.32వేలు, గొల్లపల్లిలో గంగవరపు పద్మయ్య రూ.15,700కు వేలం పాడారు.



వీకేపాడు : నిమజ్జనానికి తరలివెళ్తున్న లంబోదరుడు



ఏఎస్‌పేట : లడ్డూను దక్కించుకున్న రవీంద్రరెడ్డి

ఆర్వో ప్లాంటుకు భూమి పూజ

ఆత్మకూరు, సెప్టెంబరు 9: మున్సిపాలిటీ పరిధిలోని అనంతరాయునియేని ఎస్టీ కాలనీలో కంచి పరమేశ్వరరెడ్డి తన సొంత నిధులతో ఏర్పాటు చేస్తున్న ఆర్వో వాటర్ ప్లాంట్‌కు సోమవారం మండలాధ్యక్షుడు కేతా వేణుగోపాలిరెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డితో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మండలాధ్యక్షుడు కేతా వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడారు. కంచి పరమేశ్వరరెడ్డి ఎస్టీ కాలనీవాసుల దాహార్తిని తీర్చేందుకు మినరల్ వాటర్‌ప్లాంట్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టడం హర్షదాయకం అన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ కుడుముల సుధాకర్‌రెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ షేక్ సర్దార్, కౌన్సిలర్ రమాదేవి, వెంకటేశ్వర్లునాయుడు, మోహన్‌రెడ్డి ఉన్నారు.



భూమిపూజలో పాల్గొన్న కంచి పరమేశ్వరరెడ్డి, ప్రజాప్రతినిధులు

కౌలు రైతుల సమస్యలు పరిష్కరించండి

అనంతసాగరం, సెప్టెంబరు 9: కౌలు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పుల్లయ్య, అన్వర్‌బాష, పెంచల నాయుడు, సత్తార్‌లు సోమవారం డిప్యూటీ తహసీల్దార్ గిరీష్‌కు సోమవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రభుత్వ విధానాలతో కౌలు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని మండిపడ్డారు. రైతులకు వ్యవసాయ ఖర్చులు పెరగడం, యజమాని సంతకంతో ముడిపెట్టి కౌలు రైతుకు గుర్తింపుకార్డులు ఇవ్వడంలో అభ్యంతరం నెలకొనడంతో అవస్థలు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు.

బడిబయట పిల్లలను తరగతుల్లో చేర్పించాలి

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 9: బడిబయట, మధ్యలో బడి మానేసిన పిల్లలను గుర్తించి వారి వయసును బట్టి తరగతుల్లో చేర్పించాలని ఎంఈవో షేక్ మస్తాన్‌వలి సూచించారు. సోమవారం స్థానిక ఎంఈవో కార్యాలయంలో సీఆర్‌ఎంటీలతో సమీక్ష నిర్వహించి మాట్లాడారు. యూడైస్ ప్లస్, డ్రాప్ బాక్స్‌లోని విద్యార్థుల జాబితాను తీసుకొని వారు ఎక్కడ ఉన్నారు.. ఏ పాఠశాలలో చదువుతున్నారు లేదా వలస వెళ్లారా అనే వివరాలను సేకరించి యాప్‌లో పొందుపర్చాలన్నారు. కార్యక్రమంలో ఎంఐఎస్ కోఆర్డినేటర్ అలీం, సీఆర్‌ఎంటీలు సిద్ధయ్య, భోగ్యం శ్రీనివాసులు, మొహిద్దీన్ పాల్గొన్నారు.

పీకేపాడు చెరువులో మట్టి దోపిడీ

● ఇటుక బట్టీలకు తరలింపు

అనంతసాగరం, సెప్టెంబరు 9: పడమటికంభంపాడు ఎర్ర చెరువు నుంచి అదును చూసి మట్టి దోచేస్తున్నారు. వారంరోజుల వ్యవధిలో రాత్రుల పూట చెరువులో ఎక్స్‌కవేటర్లతో అక్రమ తవ్వకాలు జరిపి స్థానిక ఇటుక బట్టీలకు మట్టిని తరలించినట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ విషయం అధికారులకు తెలిసినా మౌనం వహించినట్లు ఆరోపణలు ఉన్నాయి. గతానికి భిన్నంగా చెరువు నుంచి మట్టి తరలింపుపై గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అదును చూసి మట్టి తరలింపుపై నిఘా ఉంచి చర్య లు తీసుకోవాలని కోరుతున్నారు.

నేడు సామాజిక తనిఖీ బహిరంగ చర్చా వేదిక

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), సెప్టెంబరు 9: స్థానిక మండల కార్యాలయ ఆవరణలో మంగళవారం 17వ సామాజిక తనిఖీ బహిరంగ చర్చా వేదిక నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో సంధ్యాలక్ష్మి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ చర్చా వేదికకు మండలంలోని ప్రజాప్రతినిధులు, ఉపాధి సిబ్బంది తప్పక హాజరు కావాలని ఆమె కోరారు.

పొలంబడి కార్యక్రమం వాయిదా

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 9: స్థానిక వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో మంగళవారం నుంచి ప్రారంభం కావాల్సిన పొలంబడి కార్యక్రమాన్ని వాయిదా వేసినట్లు వ్యవసాయ సహాయ సంచాలకులు వీ.చెన్నారెడ్డి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కోస్తాంధ్రాలో తుఫాను కారణంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని వాయిదా వేశామని, తిరిగి ఈనెల 24వ తేదీ నుంచి ప్రారంభం అవుతుందన్నారు.


సొసైటీలో మహాజనసభ సమావేశం

సంగం, సెప్టెంబరు 9: స్థానిక సొసైటీ కార్యాలయంలో సోమవారం పర్సన్ ఇన్‌చార్జి అసిస్టెంట్ రిజిస్ట్రార్ నిర్మల అధ్యక్షతన మహాజన సభ సమావేశం నిర్వహించారు. సొసైటీలోని 2,256 మంది సభ్యులకు కంప్యూటరీ కరణ చేయాల్సిన అవసరం ఉందన్నారు. సభ్యులందరూ సిబ్బందికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ ఇన్‌స్పెక్టర్ సుబ్బరామిరెడ్డి, జూనియర్ ఇన్‌స్పెక్టర్ పద్మగిరి కుమారి, కార్యదర్శి దస్తగిరి పాల్గొన్నారు.

కందుకూరు నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

● మాజీ ఎమ్మెల్యే దివి శివరాం

కందుకూరు, సెప్టెంబరు 9: నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా కందుకూరు అభివృద్ధి మండలి పనిచేస్తుందని మాజీ ఎమ్మెల్యే దివి శివరాం పేర్కొన్నారు. ఏపీ ప్రొఫెషనల్స్ ఫోరం అధ్యక్షుడు నేతి మహేశ్వరరావు అధ్యక్షతన సోమవారం అభివృద్ధి మండలి సమావేశాన్ని నిర్వహించారు. వివిధ రాజకీయ పార్టీలు, పలు ప్రజాల సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దివి శివరాం మాట్లాడుతూ రాజకీయాలతో నిమిత్తం లేకుండా కందుకూరు నియోజకవర్గ అభివృద్ధి కోసం స్థానిక ప్రజా ప్రతినిధులకు తోడ్పాటుగా ఉంటూ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయడమే ఈ మండలి లక్ష్యమన్నారు. నియోజకవర్గాన్ని ప్రకాశం జిల్లాలో కలిపేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకునేలా అభివృద్ధి మండలి తన వంతు కృషి చేస్తుందని పేర్కొన్నారు. అనంతరం పలువురు వక్తలు మాట్లాడారు. సమావేశంలో నాయకులు పోకూరి మాలకొండయ్య, బీ.వెంకటేశ్వర్లు(బీవీ), పాలేటి కోటేశ్వరరావు, ఆర్‌వీ, బీ సురేష్‌బాబు, మల్లికార్జున, కాకుమాని మాధవరావు, బొల్లినేని నాగేశ్వరరావు, పీ.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే దివి శివరాం

వైద్యాధికారులపై చర్యలు చేపట్టాలని నిరసన



తహసీల్దారు కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న గిరిజనులు

బిట్రగుంట, సెంప్టెంబరు 9: ఈ నెల 2వ తేదీన అల్లిమడుగు సంఘానికి చెందిన దినకూలీ బచ్చు శంకర్ పాము కాటుకు గురై సమీపంలోని కోవూరుపల్లి పీహెచ్‌సీలో వైద్యం అందక మృతి చెందాడని, అందుకు కారణమైన వైద్యాధి కారులపై చర్యలు చే పట్టాలని ఆల్ ఇండియా ఎరుకుల హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి కావాటి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. బోగోలు తహసీల్దారు కార్యాలయం ఎదుట మృతుడు శంకర్ కుటుంబసభ్యులు, దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లితో కలసి సోమవారం నిరసన తెలిపారు. తహసీల్దారు సురేష్‌బాబుకు వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ పాము కాటు వేసిన వెంటనే కోవూరుపల్లి పీహెచ్‌సీకి వెళ్లిన శంకర్‌కు ప్రథమ చికిత్స చేయక పోగా, వ్యాక్సిన్ లేదని వైద్యం చేయక పోవడం దారుణమన్నారు. అక్కడి నుంచి బాధితుడిని కావలికి తరలించడం ఆలస్యం కావడం వల్ల మృతి చెందాడని పేర్కొన్నారు. ముందుగా వైద్యం చేసి ఉంటే బతికే వాడని అన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన వైద్యులపై చట్టరీత్యా చర్యలు చేపట్టి, బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలన్నారు.

మందులతో విజయవాడకు రెడ్‌క్రాస్ బృందం

కావలి, సెప్టెంబరు 9: విజయవాడలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో వైద్యశిబిరాల నిర్వహణకు స్థానిక రెడ్‌క్రాస్ వైద్య సహాయ బృందం సోమవారం బయలు దేరింది. రెడ్‌క్రాస్ విపత్తు విభాగ కన్వీనర్ బీద లక్ష్మీనంద నాయకత్వంలో రూ.1,10,000ల విలువైన మందులను తీసుకుని వారు తరలి వెళ్లారు. ఈ బృందానికి రెడ్‌క్రాస్ ప్రతినిధులు రవిప్రకాష్, కలికి శ్రీహరిరెడ్డి, హరినా రపరెడ్డి, బీఎస్ ప్రసాద్, బాలు వీడ్కోలు పలికారు. రెడ్‌క్రాస్ కావలి శాఖ చైర్మన్ రవిప్రకాష్ మాట్లాడుతూ సుమారు వెయ్యి దుస్తుల కిట్లను కూడా సిద్ధం చేస్తున్నామని, త్వరలో వాటిని కూడా పంపిణీ చేస్తామన్నారు. వైద్య సహాయ బృందంలో సచికేతన్, సాయి కుమార్, వెంక టేశ్వర్లు, మధుసూదనరెడ్డి ఉన్నారు.



రెడ్‌క్రాస్ వైద్య సహాయ బృందానికి వీడ్కోలు చెపుతున్న రెడ్‌క్రాస్ బాధ్యులు

వైసీపీ ఎంపీపీ తీరుపై విమర్శలు

● అధికారులపై పెత్తనం చెలాయింపు

ఏఎస్ పేట, సెప్టెంబరు 9: వైసీపీ ఎంపీపీ పద్మజారెడ్డి సోమవారం ఎంపీపీ కార్యాలయంలో పీహెచ్‌సీల అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించడంపై విమర్శలు వస్తున్నాయి. చిరమన, ఏఎస్ పేట పీహెచ్‌సీల అభివృద్ధికి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ కమిటీలో తహసీల్దారు, ఎంపీడీవో, వైద్యులు సభ్యులుగా ఉంటారు. సమావేశాన్ని పీహెచ్‌సీలో లేదా ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించకుండా ఎంపీపీకి కేటాయించిన గదిలో నిర్వహించడం చర్చనీయాంశం అయ్యింది. ఇటీవల స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ సమావేశానికి అధికారులు ఆలస్యంగా రావడంపై ఆమె ఫైర్ అయ్యారు. అదే సమయానికి మండలంలో కలెక్టర్ పర్యటించడంతో అధికారులు ఆయన వెంటే ఉన్నారు. సమావేశానికి కొంత ఆలస్యంగా వచ్చిన విషయాన్ని తెలిపినా వినకుండా అధికారులపై పైతనం చెలాయించారు.

బిర్యానీ పొట్లాల పంపిణీ

కావలిటౌన్, సెప్టెంబరు 9: ఆపద్బాంధవ సేవాట్రస్ట్ ఆధ్వర్యంలో పీఎంపీ అసోసియేషన్ డివిజన్ అధ్యక్షుడు డాక్టర్ వెంకటరమణయ్య సౌజన్యంతో సోమవారం పట్టణంలోని కావేరిగుంట గిరిజనులకు చికెన్ బిర్యానీ పొట్లాలు పంపిణీ చేశారు. నిర్వాహకులు మాట్లాడుతూ వెంకటరమణయ్య తండ్రి తిరుపాలయ్య వర్ధంతిని పురస్కరించుకుని ప్రతిఏటా గిరిజనులకు బిర్యానీ పొట్లాలు పంపిణీ చేయడం ఆయన సేవాదృక్పథానికి నిదర్శనమని అన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు ఖాదర్‌బాష, ట్రస్ట్ అధ్యక్షుడు మధుసూదన్‌రావు, మాలకొండారెడ్డి, మస్తానయ్య, రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

15వ ఆర్థిక సంఘం రెండో విడత నిధులు విడుదల

లింగసముద్రం, సెప్టెంబరు 9: మండలంలోని 16 గ్రామ పంచాయతీలకు 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 15వ ఆర్థిక సంఘం రెండో విడత నిధులు రూ.80,47,281 విడుదల అయినట్టు ఈవోఆర్డీ కేవీ రామసుబ్బారావు సోమవారం తెలిపారు. ఈ నిధుల్లో టైడ్ రెండో విడత నిధులు రూ.48,28,374, అలాగే అన్‌టైడ్ రెండో విడత నిధులు రూ.32,18,907 ఉన్నాయని చెప్పారు. ఈ నిధులతో పంచాయతీల్లో పారిశుధ్యం మెరుగు, తాగునీటికి, రోడ్ల ఏర్పాటుకు, ఇతర అభివృద్ధి పనులకు ఖర్చు చేయనున్నట్లు వివరించారు.

సిబ్బందికి సన్మానం

బిట్రగుంట, సెప్టెంబరు 9: విజయవాడలోని వరద బాధిత ప్రాంతాల్లో విధులు నిర్వహించిన విశ్వనాథరావుపేట పంచాయతీ కార్యదర్శి మహబూబ్‌బాషా, సిబ్బందిని సోమవారం బోగోలు ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీడీవో వెంకటసుబ్బారావు సన్మానించారు. బోగోలు, జువ్వలదిన్నె, సీఆర్‌పాలెం పంచాయతీల స్వీపర్లు ఏడుకొండలు, కృష్ణయ్య, జీవన్, మహేష్ సేవలను విశ్వనాథరావుపేట సర్పంచు జీ మంజుల, టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరావు కొనియాడారు. వారికి నగదు బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ శ్వేత, ఏవో గోవిందరావు, టీడీపీ నేతలు ఎల్.సుధీర్‌బాబు, ఎం.వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

కలుషిత నీటితో రోగాల పాలు

కావలి, సెప్టెంబరు 9: పట్టణ ప్రజలకు శుద్ధినీరు అందిస్తున్నామని, ప్రతి ఒక్కరూ కుళాయి కనెక్షన్ తీసుకోవాలని మున్సిపల్ అధికారులు చెబుతున్నారు. అయితే కుళాయిల్లో కలుషిత నీరు వస్తున్నా వారు చర్యలు తీసుకోవడంలేదు. పట్టణంలో ప్రధాన పైపులైన్ల నుంచి ఆయా ప్రాంతాలకు సరఫరా చేసేందుకు ఏర్పాటు చేసిన వాల్వు గుంతలు నిర్వహణలోపంతో బురదగుంతలుగా మారాయి. వాటిలో పందులు పొర్లాడుతూ నీటిని కలుషితం చేయటంతో ప్రజలకు ఆ నీరే కుళాయిల్లో వస్తోంది. దీంతో ప్రజలు రోగాల బారిన పడే ప్రమాదాలు ఉన్నాయి. మంచినీటి వాల్వుగుంతలపై మూత బండలు వేసి దాని పైన ఉన్న రంధ్రం ద్వారా వాల్వు ఆన్ అండ్ ఆఫ్ చేయాల్సి ఉంది. కానీ కావలిలో ఎక్కడా వాల్వు గుంతలపై మూతబండలు లేవు. వాటిల్లో చెత్తా చెదారం పడి మురికి గుంతలుగా మారుతున్నాయి. మున్సిపల్ అధికారులు స్పందించి వాల్వు గుంతలపై మూత బండలు వేయాలని కోరుతున్నారు.

టీడీపీ గూటికి చాకిచర్ల సర్పంచి

కందుకూరు, సెప్టెంబరు 9: ఉలవపాడు మండలం చాకిచర్ల సర్పంచి వీరమల్లు విజయమ్మ సోమవారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఆమె ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావును కలిసి పుష్పగుచ్ఛం, శాలువాతో సత్కరించారు. అనంతరం సర్పంచి విజయమ్మను టీడీపీలోకి సాదరంగా ఆహ్వానించారు. సర్పంచితోపాటు 10వ వార్డు సభ్యుడు ప్రయకావేరి అంకయ్య, వైసీపీ నేత తోట వెంకటనారాయణలు కూడా టీడీపీలో చేరారు.ఈ కార్యక్రమంలో గ్రామ టీడీపీ అధ్యక్షుడు మిరియం మల్లికార్జున, ఇతర నాయకులు పాల్గొన్నారు.

● సబ్ కలెక్టర్‌ను కలిసిన ఇంటూరి

ఇటీవల సబ్‌కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన తిరుమణి శ్రీపూజను ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సోమవారం ఉదయం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని సమస్యలు, ఇతర అంశాలపై చర్చించారు. పూల మొక్కను అందచేసి అభినందనలు తెలిపారు. కాగా మున్సిపల్ కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన కొర్రపాటి అనూష సోమవారం ఎమ్మెల్యేను ఇంటివద్ద మర్యాదపూర్వకంగా కలిశారు.

స్వయం ప్రతిపత్తిపై అవగాహన

కందుకూరు, సెప్టెంబరు 9: సాధికారత, స్వయం ప్రతిపత్తిపై స్థానిక టీఆర్ఆర్ డిగ్రీ కళాశాలలో సోమవారం స్టూడెంట్ ఇండక్షన్ ప్రోగ్రాం జరిగింది. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన సాధికారత విభాగాన్ని విద్యార్థులకు పరిచయం చేశారు. మహిళా సాధికారత కన్వీనర్ షేక్ షానాజ్ బేగం మాట్లాడారు. కార్యక్రమంలో అధ్యాపకురాళ్లు డాక్టర్ కేవీ పద్మావతి, డాక్టర్ ఐ అనూష, డాక్టర్ కే సుజాత, ఎం జ్యోతి, ఇండక్షన్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ కన్వీనర్, పీడీ డాక్టర్ కరుణకుమార్, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గణనాథుడికి పూజలు

బుచ్చిరెడ్డిపాళెం, సెప్టెంబరు 9: వినాయక చవితిని పురస్కరించుకుని బుచ్చి నగర పంచాయతీతోపాటు మండలంలో వాడవాడలా నెలకొల్పిన వినాయకుడి విగ్రహాలకు సోమవారం భక్తులు ఘనంగా పూజలు చేశారు. సాల్మన్‌పురంలో గణపతి లడ్డూను రూ. 60వేలకు రఘురామిరెడ్డి, వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయం వద్ద 13కేజీల లడ్డూను రూ. 27,516లకు గుబ్బా సురేష్, స్వామివారి పూలమాలలను రూ.70 16లకు లక్ష్మణ్ వేలంలో దక్కించుకున్నారు. వినాయకుడి విగ్రహాలను జొన్నవాడ పెన్నానదిలో నిమజ్జనం చేశారు.


బుచ్చిరెడ్డిపాళెం: సాల్మన్‌పురంలో భారీ గణనాథుడి ప్రతిమ

●ముత్తుకూరు: అదానీ కృష్ణపట్నం పోర్టులో సోమవారం గణేష్ నిమజ్జనోత్సవం ఘనంగా నిర్వహించారు. పోర్ట్ అడ్మిన్ భవనంలో ఏర్పాటు చేసిన గణేష్ ప్రతిమకు మూడు రోజులు పూజలు చేశారు. నిమజ్జనోత్సవంలో పోర్టు సీఈవో జీజేరావు, సీఓఓ రాజన్‌బాబు, కార్పొరేట్ అఫైర్స్ హెడ్ జీ వేణు గోపాల్, అడ్మిన్ హెడ్ గణేష్‌శర్మ ప్రత్యేక పూజలు చేశా రు. అనంతరం తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ ఏజీఎం గంగా సతీష్, పుచ్చలపల్లి శ్రీనివాసులు, రాజేష్‌యాదవ్, వివిధ విభాగాలు హెచ్‌ఓ డీలు, అడ్మిన్ టీం, పోర్టు ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.


పొదలకూరు : థార్ వాహనంపై ఊరేగుతున్న వినాయకుడు

కోలాహలంగా నిమజ్జనోత్సవాలు

●పొదలకూరు: పట్టణంలోని కాకాణి రమణారెడ్డినగర్‌కి చెందిన ఛత్రపతి శ్రీధర్, కనకవల్లి దంపతులు హైదరాబాద్ నుంచి ప్రత్యేకంగా మూడడుగుల వినాయకుడి విగ్రహాన్ని తీసుకొచ్చి తమ ఇంట్లో పెట్టి మూడు రోజుల పాటు విశేష పూజలు చేసి నైవేద్యాలు సమర్పించారు. సోమవారం విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి మహేంద్ర థార్ వాహనంపై కేఆర్ నగర్, పంచాయతీ బస్టాండు, గేట్ సెంటర్ వరకు ఊరేగింపు నిర్వహించారు. అనంతరం దేగపూడి కల్లేటిలో విఘ్నేశ్వరుడిని నిమజ్జనం చేశారు.

పట్టణంలోని తొగటవీధి వినాయకుని మండపం వద్ద టీడీపీ యువ నాయకుడు, జిల్లా రూరల్ ఆర్యవైశ్య సంఘం సెక్రటరీ పిన్నెల ప్రభాకర్, పిన్నెల చిన్నయ్య సోదరుల ఆధ్వర్యంలో సోమవారం మధ్యాహ్నం అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఆర్యవైశ్య నాయకులు అమర్తలూరు చెంచయ్య, రాజపూటి ధనుంజయరావు, పొట్టి సుధాకర్, ఆకులూరు విజయ, తదితరులు ముందుగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పిన్నెల గాయత్రి, సుకన్య, పల్లవి, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ భాషా దినోత్సవం



తెలంగాణ భాషా దినోత్సవంలో మాడభూషి సంపత్‌కుమార్ తదితరులు

వెంకటాచలం, సెప్టెంబరు 9: మండలంలోని చవట పాళెం పంచాయతీ సరస్వతి నగర్ వద్ద ఉన్న ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రంలో తెలంగాణ ఉద్యమ కవి కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకొని సోమవారం తెలంగాణ భాషా దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా జాతీయ సదస్సు నిర్వహించగా తంగెడ కిషన్‌రావు ముఖ్య అతిథిగా విచ్చేసి నారాయణరావు సేవలను కొనియాడారు. విశిష్ట అతిథి డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి మాట్లాడుతూ భాషను కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో అధ్యయన కేంద్రం సంచాలకులు మాడభూషి సంపత్‌కుమార్, నిత్యానందరావు, డాక్టర్ లావణ్య, డాక్టర్ రఘు, డాక్టర్ కృష్ణయ్య, డాక్టర్ విల్సన్‌రావు, డాక్టర్ మల్లెల రామయ్య తదితరులున్నారు.

ఎర్రగుంటలో వీధి దీపాల ఏర్పాటు

వెంకటాచలం, సెప్టెంబరు 9: మండలంలోని చవటపాళెం పంచాయతీ ఎర్రగుంట, అబ్బిసాహెబ్ కండ్రిగ గ్రామాల్లో సగానికిపైగా వీధి దీపాలు వెలగకపోవడంతో రాత్రయితే గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను గుర్తించిన తెలుగుయువత సర్వేపల్లి నియోజకవర్గ అధికార ప్రతినిధి వలిపి వెంకటేష్ సోమవారం రూ.30 వేలు తన సొంత నిధులను వెచ్చించి కొత్త వీధి దీపాలతో పాటు వెలగని దీపాలకు మరమ్మతు చేయించారు. దీంతో గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేశారు.

వైసీపీ పాలనలో పారిశుధ్యం అధ్వానం

పొదలకూరు, సెప్టెంబరు 9: ఐదేళ్ల వైసీపీ పాలనలో పొదలకూరు మేజర్ పంచాయతీలో పారిశుధ్యం లోపించిందని, కనీసం కాలువల పూడికతీత కూడా జరగలేదని సర్వేపల్లి జనసేన నాయకుడు బొబ్బేపల్లి సురేష్ నాయుడు అన్నారు. సోమవారం పట్టణంలోని పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సొంత మండలమైన పొదలకూరులో కనీసం కాలువల్లో మురుగు, చెత్తను తొలగించిన పరిస్థితి లేదన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు నారదాసు రవి, యనమల మధు, బండి మనోజ్, టీడీపీ నాయకులు జమీర్, ఖాదర్‌బాషా, బీజేపీ మండల అధ్యక్షుడు అయోధ్య రామయ్య, పాల్గొన్నారు.

31లోపు భూమి వివరాలివ్వాలి

బుచ్చిరెడ్డిపాళెం, సెప్టెంబరు 9: భూమి వివరాలు లేని 330 రూపాయల షేర్ హోల్డర్లు (ఖాతాదారులు) నెలాఖరు లోపు భూమి వివరాలతో పాటు వారి ఖాతాలకు ఆధార్ లింక్ కోసం ఆధార్‌కార్డు, ఒక ఫోటో, ఫోన్‌నెంబరు తెలియజేయాలని వవ్వేరు కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ పర్సన్ ఇన్‌చార్జ్, సీనియర్ ఇన్‌స్పెక్టర్ కట్టా సుబ్రమణ్యం తెలిపారు. సోమవారం వవ్వేరు బ్యాంకులో బ్యాంకు సీఈఓ ఆధ్వర్యంలో జరిగిన మహాజన సభకు ఆయన హాజరయ్యారు. ఈసందర్భంగా బ్యాంకు ఆర్థిక లావాదేవీల గురించి బ్యాంకు ఖాతాదారులకు సీఈఓ శ్రీనివాసులు వివరించారు. దీర్ఘకాలిక రుణాలు చెల్లింపులో రైతులు వెనుకబడి ఉన్నారని, సకాలంలో చెల్లించి సంఘ అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోవూరు ఉప సహకారాధికారి ఎంవీ సుభాషిణి, సీనియర్ ఇన్‌స్పెక్టర్, సేల్స్ అధికారి పి సురేష్‌బాబు, సొసైటీ సిబ్బంది, సభ్యులు పాల్గొన్నారు.

జ్వాలాముఖి ఆలయ హుండీ లెక్కింపు

● కౌలు భూములకు వేలం పాట


హుండీ లెక్కిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

తోటపల్లిగూడూరు, సెప్టెంబరు 9: మండలంలోని వరిగొండ గ్రామంలో జ్వాలాముఖి అమ్మవారి దేవస్థానం, శ్రీరామ మందిరం మాగాణి భూముల బహిరంగ వేలం పాటలు సోమవారం ఆలయాల కార్యనిర్వాహణాధికారి తాత శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. జ్వాలాముఖి ఆలయానికి చెందిన 6 ఎకరాల 59 సెంట్లు, అలాగే శ్రీరామ మందిరానికి చెందిన 12 ఎకరాల 19 సెంట్లకు గాను కౌలుదారులు హెచ్చుపాట ద్వారా భూములు కౌలుకు పొందారు. కాగా, గత సంవత్సరం కంటే ఎక్కువ ఆదాయం వచ్చిందని ఈవో శ్రీనివాసరావు తెలిపారు. అలాగే జ్వాలాముఖి ఆలయంలో రెండు హుండీల ద్వారా ఆదాయం గత ఫిబ్రవరి నుంచి 7నెలల కాలంలో రూ.2,67,750 వచ్చిందని ఈవో తెలిపారు. ఈ వేలం పాటలు, హుండీ లెక్కింపు కార్యక్రమంలో స్థానిక నేతలు కోడూరు శ్రీనివాసులురెడ్డి, చిన్న బాబిరెడ్డి, జలదంకి హరికృష్ణరెడ్డి, కర్పూరం శ్రీనివాస్‌రెడ్డి, బొడ్డు కృష్ణప్రసాద్, అద్దంకి రవి, అన్నం రామచంద్రయ్య, ఆలయ అర్చకులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు వెంటనే అమలు చేయాలి

● కౌలు రైతు సంఘం ఆందోళన


ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

బుచ్చిరెడ్డిపాళెం, సెప్టెంబరు 9: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేయాలని కౌలురైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ముత్యాల గుర్నాధం డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దారు కార్యాలయం వద్ద ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఆందోళన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ రైతులకు, కౌలురైతులకు అన్నదాత సుఖీభవ పథకం కింద వెంటనే రూ.20 వేలు వారి ఖాతాలకు జమచేయాలని, కౌలు రైతుల గుర్తింపుకార్డులను యజమానుల సంతకాలతో సంబంధం లేకుండా ప్రభుత్వమే జారీచేయాలని, సాగుదారులను గుర్తించి వారి పేర్లు ఈక్రాప్‌లో నమోదు చేయాలని, స్మార్ట్ మీటర్లు ఏర్పాటు నిర్ణయం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తదితర పథకాలను అమలు చేయాలన్నారు. అనంతరం తహసీల్దారు వెంకటేశ్వర్లుకు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి మల్లికార్జున, కార్మిక సంఘం మడల అధ్యక్షుడు తంబి రమణయ్య, ప్రజాసంఘాల నాయకులు పోతంశెట్టి శ్రీనివాసులు, ఎస్‌కే జానీబాష, నన్నం మాధవయ్య, అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఆధార్‌కార్డు సవరణలు చేయాలి

●తహసీల్దార్‌కి బీజేపీ నేతల వినతి


తహసీల్దార్‌కి వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నేతలు

ఇందుకూరుపేట, సెప్టెంబరు 9: అర్హులైన ప్రతి ఒక్కరికీ ఆధార్ కార్డు సవరణలు చేయాలని బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు కైలాసం శ్రీనివాసరెడ్డి కోరారు. మండలంలోని తహసీల్దారు కార్యాలయం ఆవరణలో ఆయన పత్రికా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎటువంటి చదువు లేనివారికి ఆధార్‌కార్డు సవరణలు చేయడం లేదని, దీంతో అర్హత ఉండి కూడా చాలామంది వృద్ధాప్య పింఛన్ రాక ఇబ్బంది పడుతున్నారని, ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం పరిశీలించి అర్హులైన ప్రతి ఒక్కరినీ ఆధార్‌కార్డు సవరణకు అనుమతించాలని, అదేవిధంగా ఒంటరిగా వుండే వారికి రేషన్ కార్డు ఇవ్వడంలేదని ఈవిషయంపై అధికారులు స్పందించి వారిని ఆదుకోవాలని కోరారు. అనంతరం మండల తహసీల్దారుకి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు శ్రీని వాసులు, వాకాటి ప్రసాద్, మేనాటి పవన్‌రెడ్డి, సాయి, గుమ్మడి పరంధామయ్య, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

బుచ్చిరెడ్డిపాళెం, సెప్టెంబరు 9: గర్భిణులు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసు కోవాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఉమా సూచించారు. పౌష్టికాహార మాసోత్సవాలను సోమవారం జొన్నవాడ పీహెచ్‌సీలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రంలో టేక్‌హోం రేషన్‌ను అర్హులైన లబ్ధిదారులు మాత్రమే తీసుకోవాలన్నారు. కిశోర బాలకలకు వివాహాలు చేయకూడదన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రత్యూష, అవంతి, హెల్త్ సూపర్‌వైజర్ సరస్వతి, ఏఎన్‌ఎం భారతి, ఆశా వలంటీర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, పద్మ, అమృతవల్లి, ఆయాలు పాల్గొన్నారు.

పౌష్టికాహారం పంపిణీ

స్థానిక ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో సోమవారం మహాయాగ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ సభ్యులు దొడ్ల కోదండరామిరెడ్డి, ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ పద్మజ అధ్వర్యంలో 70మంది గర్భిణులకు ఐరన్ టానిక్, పండ్లు, బిస్కెట్లు, మధ్యాహ్న భోజనం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి డాక్టర్ సుబ్బయ్య, మనోజ్, కామాక్షయ్య, సుమన్ ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

రాధాష్టమి వేడుకలు

వెంకటాచలం, సెప్టెంబరు 9: స్థానిక రాధేరాధే కృష్ణ మందిరంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం రాధాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం మూల విరాట్ ఉత్సవ విగ్రహాలకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేసి పల్లకి సేవ నిర్వహించి మధ్యాహ్నం అన్నదానం చేపట్టారు.


ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

పక్కేళ్లమ్మకు ప్రత్యేక పూజలు

కోవూరు, సెప్టెంబరు 9: గంగవరం గ్రామదేవత పక్కేళ్లమ్మకు సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మ వారికి బడికాల రఘునాథ్‌గౌడ్, పుష్పలత దంపతులు బంగారు మంగళసూత్రాన్ని బహూకరిం చారు. ఆలయంలో పూలంగి సేవ, పల్లకీసేవ నిర్వహించి భ క్తులకు తీర్థప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి యేడెం లక్ష్మీకుమారి, టీడీపీ నాయకులు గూటూరు శ్రీధరనాయుడు, నాగిరెడ్డి వెంకట్రామిరెడ్డి, కరేటి సుబ్రహ్మణ్యంరెడ్డి, సిద్దారెడ్డి శ్రీహరిరెడ్డి, సూరం వేణుగోపాలరెడ్డి, చుండి చెన్నారెడ్డి, బుధవరపు శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.


పక్కేళ్ళమ్మకు పూజలు చేస్తున్న భక్తులు

నెల్లూరు సిటీ, రూరల్ కోవూరు, సర్వేపల్లి

ఏకదంతం ఉపాస్మహే !

నగరంలో వైభవంగా కొనసాగుతున్న చవితి ఉత్సవాలు

నెల్లూరు(సాంస్కృతికం), సెప్టెంబరు 9 : నగరంలో చవితి వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణపతి మండ పాల్లో విశేష పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

● పొదలకూరురోడ్డు ఎన్‌సీసీ కాలనీలో ఏర్పాటు చేసిన గణపతి విగ్రహం వద్ద సౌత్ ఇండియాలో పేరెన్నిక కలిగిన దుకాణాల నుంచి తెచ్చిన 108 రకాల స్వీట్స్‌ని నైవేద్యాలుగా పెట్టి పూజలు చేశారు.

● ఖైపాడు గేటు మిత్ర మండలి ఆధ్వర్యంలో జరిగిన మహాగణపతి హోమంలో పాల్గొన్న భక్తులకు స్వామి వెండి డాలర్లు అందజేశారు.

● సరస్వతీనగర్‌లో ఏర్పాటు చేసిన గణపతి మండపంలో అన్నదానం జరిగింది. రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు, గణేష్ నిమజ్జనం జరిగాయి.

● పెద్ద పోస్టాఫీసు గణేష్ మిత్ర మండలి ఆధ్వర్యంలో విశేష పూజలు జరిగాయి. ఈ కార్యక్రమంలో అతిథులుగా తెలుగుదేశం పార్టీ నాయకురాలు తాళ్లపాక అనురాధ, పిట్టు సత్యనాగేశ్వరరావులు పాల్గొన్నారు. అనంతరం అన్నదాన చేశారు.

● వెంగళరెడ్డినగర్‌లోని వైష్ణవి అపార్టుమెంటులో ఏర్పాటు చేసిన గణపతికి విశేష పూజలు, సామూహిక సహస్రనామ పారాయణ జరిగాయి.

● 31వ డివిజన్‌లో ఏర్పాటు చేసిన గణపతుల మండపాల్లో విశేష పూజలు, అన్నదాన కార్యక్రమాలు జరిగాయి.

● రూ.100లకే 516 కేజీల లడ్డూ

నగరంలోని వేదాయపాలెం వేద గణపతి ఆలయం వద్ద గణేష్ ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. సింహపురి గణేష్ ఉత్సవ కమిటీ ట్రస్ట్ 41వ గణేష్ ఉత్సవాల సందర్భంగా స్వామివారి ఎదుట 516 కేజీల భారీ లడ్డూను ప్రసాదంగా పెట్టి పూజలు చేశారు. ఈ లడ్డూ సామాన్య భక్తులకు చెందాలని ఆశించి వినాయక చవితి నుంచి 13వ తేదీ వరకు భక్తులకు రూ.100 లక్కీ కూపన్ టికెట్లు విక్రయిస్తోంది. 13వ తేదీ రాత్రి పెద్దల సమక్షంలో ఈ లక్కీ కూపన్లు డ్రా తీసి విజేతకు 516 కేజీల లడ్డూను అందజేస్తామని ట్రస్ట్ సభ్యులు తెలిపారు.

● వేదాయపాలెం గణేష్ మిత్రమండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి సింహవాహన గణపతికి ఉదయం, సాయంత్రం విశేష పూజలు జరిగాయి. మ్యూజికల్ నైట్ అలరించింది. అనంతరం స్వామికి ప్రసాదంగా ఉంచిన 40కేజీల లడ్డూకు బహిరంగ వేలం పాట జరిగింది. అలాగే నగరంలోని అన్ని గణేష్ మండపాలలో పూజలు, ఉట్టి మహోత్సవాలు, అన్నదానాలు జరిగాయి.


వేదాయపాలెం వేదగణపతి మండపంలో ఏర్పాటు చేసిన 516 కేజీల మహాలడ్డూ

● నగరంలోని 33వ డివిజన్ నేతాజీ నగర్ 8వ వీధిలో ఏర్పాటు చేసిన గణనాథుని విగ్రహం వద్ద 108 కళాశాలతో నేతాజీనగర్ నుంచి దర్గామిట్టలోని రాజరాజేశ్వరి ఆలయం వరకు, అక్కడి నుంచి తిరిగి నేతాజీ నగర్‌కు మహిళలు ప్రదర్శన నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం, రాత్రి ప్రత్యేక అలంకరణలో గ్రామోత్సవం నిర్వహించి గణేశ్ ఘాట్‌లో నిమజ్జనం చేశారు.

● చిన్నబజారులో మరాటీ మిత్ర మండలి ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహాన్ని నారాయణ విద్యా సంస్థల జీఎం వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్మవరం సుబ్బారావు పాల్గొన్నారు.

● నగరంలోని పురమందిరం ప్రాంగణంలోని జ్యోతి వినాయక మందిరంలో చవితి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఉదయం మూలవరులకు చందనాలంకారం, విశేష పూజలు, రాత్రి పుష్పాలంకారం, ఉత్సవమూర్తికి నెమలి వాహనంపై నగరోత్సవం జరిగింది.

● నగరంలోని పప్పులవీధి సిద్ధేశ్వరస్వామి ఆలయంలో ఉదయం, సాయంత్రం విశేష పూజలు, రాత్రి ప్రత్యేక పూలంగిసేవ, ఆలయ ప్రధాన అర్చకులు మాచవోలు కోటేశ్వరశర్మ ఆధ్వర్యంలో జరిగాయి.


బాలాజీనగర్‌లోని గణపతి మండపంలో టీడీపీ నేత కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి

రేపటి నిమజ్జనానికి తరలిరండి : ఎమ్మెల్యే కోటంరెడ్డి

నగరంలోని ఇరుకళల పరమేశ్వరి ఆలయం వద్ద నెక్లెస్ రోడ్డు గణేష్ ఘాట్‌లో 11వ తేదీ జరిగే గణేష్ నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. సోమవారం అధికారులు, విక్రమ సింహపురి గణేష్ ఉత్సవ సమితి నాయకులతో కలసి సమీక్షించిన అనంతరం ఘాట్‌ను పరిశీలించారు.. 11వ తేదీ సాయంత్రం మహిళలతో శోభాయాత్ర, గంగా హారతులు జరుగుతాయని, నెల్లూరు, కోవూరు, సర్వేపల్లి నియోజకవర్గాల ప్రజలందరూ తరలిరావాలని కోరారు. దేవదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో 14 దేవాలయాల ఉచిత ప్రసాదాలు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ నందిమండలం భానుశ్రీ, విక్రమ సింహపురి గణేష్ ఉత్సవ సమితి నాయకులు పి.సురేంద్రరెడ్డి, పిట్టి సత్యనాగేశ్వరరావు, భయ్యా వాసు, మోహనరావు, మండ్ల ఈశ్వరయ్య, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో భాగస్వాములు కండి

● నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి


సర్పంచు దంపతులను టీడీపీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

నెల్లూరు రూరల్, సెప్టెంబరు 9 : నెల్లూరు రూరల్ నియోజకవర్గం అభివృద్ధిలో అందరు ప్రత్యక్ష, పరోక్షంగా భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. వైసీపీకి రాజీనామా చేసిన గొల్లకందుకూరు సర్పంచు దొరసానమ్మ దంపతులను ఎమ్మెల్యే కార్యాలయంలో సోమవారం కండువా కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థలకు ప్రజాప్రతినిధులుగా ఉన్న వారికి గత వైసీ పీ ప్రభుత్వంలో కనీస గౌరవం కరువైందన్నారు. వారిని పట్టించుకున్న నాథుడే లేరని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం చంద్రబాబు సర్కారులో సర్పంచులకు తగిన గౌరవం ఇచ్చి అన్నింటా ముందుడి నడిపిస్తున్నామని తెలిపారు. గ్రామంలో జరిగే అభివృద్ధిలో వారిదే కీలకపాత్రన్నారు. పార్టీలకు అతీతంగా అభివృద్ధి చేయడమే ప్రస్తుతం తనముందున్న కర్తవ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, నాయకులు పొణక హరిప్రసాద్‌రెడ్డి, శివకుమార్ రెడ్డి, దయాకర్‌రెడ్డి, బుజ్జిరెడ్డి, వెంకటరమణయ్య, గుడి మస్తానయ్య, లచ్చారెడ్డి, శ్రీకాంత్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వెంకయ్య స్వామి 42వ ఆరాధన

నెల్లూరు(సాంస్కృతికం), సెప్టెంబరు 9 : నగరంలోని మూలాపేట గురునిలయంలో మాకాని వెంకట్రావు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో భగవాన్ వెంకయ్యస్వామి 42వ ఆరాధన మహోత్సవం వైభవంగా జరిగింది. హోమాలు, విశేష పూజలు, అభిషేకాలు, అన్నదానం జరిగాయి. ఇతర రాష్ట్రాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. గాలిపాలెం నుంచి నారాయణదాసు స్వామి తంబురనాదంతో భక్తులకు భవిష్యవాణి తెలిపారు. పారిశ్రామికవేత్త పెంచలయ్య, హైకోర్టు న్యాయవాది మాకాణి చంద్ర, తదితర ప్రముఖులు హాజరయ్యారు. ఈ కార్యక్రమాలను మాకాని గోపి, మాకాని వెంకట్రావు, శిష్యబృందం పర్యవేక్షించింది.

కార్పొరేషన్‌లో అర్జీలు స్వీకరించిన ఏడీసీ

నెల్లూరు(సిటీ), సెప్టెంబరు 9: కార్పొరేషన్ కార్యాల యంలో సోమవారం నిర్వహించిన ప్రజా విజ్ఞప్తుల పరిష్కార వేదికలో ఏడీసీ శర్మద నగర వాసుల నుంచి అర్జీలు స్వీకరించారు. కమిషనర్ సూర్యతేజ విజయవాడ వరదల డ్యూటీలో ఉండటంతో ఆమె నగర వాసుల నుంచి వినతులను తీసుకుని పరిష్కారం నిమిత్తం ఆయా విభాగాలకు పంపారు. వీటిని క్షేత్ర స్థాయిలో పరిశీలించి శాశ్వత పరిష్కారం చూపాలని ఆమె ఆదేశించారు.

ఉద్యోగోన్నతి పొందిన అధికారులకు సన్మానం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), సెప్టెంబరు 9: జిల్లా రవాణాశాఖలో మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లుగా విధులు నిర్వహిస్తూ ఆర్‌టీవోలుగా ఉద్యోగోన్నతి పొంది ఇతర జిల్లాలకు బదిలీపై వెళుతున్న అధికారులను సోమవారం నగరంలోని డీటీసీ కార్యాలయంలో అధికారులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డీటీసీ బీ చందర్ మాట్లాడుతూ జిల్లాలో మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లుగా అనేక సేవలు అందించిన కె.మురళీమోహన్, అడ్మినిస్ట్రేటివ్ అధికారి బీఎస్‌కే కిషోర్‌లు ఆర్‌టీవోలుగా ఉద్యోగోన్నతి పొందడం ఆనందంగా ఉందన్నారు. వారు ఏ ప్రాంతంలో విధులు నిర్వహించినా ప్రజలకు మరింత సేవలు అందించాలని దేవుడును కోరుతున్నానన్నారు. ఈ కార్యక్రమంలో ఎంవీఐ బాలమురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

యజమానితో సంబంధం లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి

● తహసీల్దారు కార్యాలయం ఎదుట సీపీఎం ధర్నా

నెల్లూరు రూరల్, సెప్టెంబరు 9 : కౌలు రైతులను ఆదుకునేందుకు భూ యజమానితో సంబంధం లేకుండా గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని, కేంద్రం ఇచ్చిన హామీ మేరకు స్వామినాథన్ కమిటీ సిఫార్సులు అమలు చేయాలని సీపీఎం డిమాండ్ చేసింది. ఈ మేరకు సీపీఎం, రైతుకూలీ, కౌలురైతు, రైతు సంఘాల నేతృత్వంలో సోమవారం నెల్లూరురూరల్ తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు చంద్రమౌళి, జనార్దన్, తిరుపాలు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కూటమి పార్టీలు అధికారంలో వచ్చేదానికి ఇచ్చిన అనేక హామీలు అమలు చేయాలని చెప్పారు. జిల్లాలో లక్ష మందికి పైగా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు లేవన్నారు. భూ యజమానులతో సంబంధం లేకుండా గుర్తింపుకార్డులు ఇచ్చినప్పుడే వారికి బ్యాంకుల్లో రుణాలు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అట్ల అనిల్, మల్లె సిమగిరి, గుడి రవీంద్ర, జానా లక్ష్మీప్రసాద్ పాల్గొన్నారు.

ఇంకెప్పుడు న్యాయం చేస్తారు.. ?

● వైద్యుల నిరసన ప్రదర్శన


నిరసన ప్రదర్శనలో వైద్యులు

నెల్లూరు(వైద్యం), సెప్టెంబరు 9 : కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై అత్యాచారం, హత్య జరిగి నెలరోజులైనా ఇప్పటి వరకు ఎలాంటి న్యాయం జరుగలేదని, ఇంకెప్పుడు న్యాయం చేస్తారని పలువురు వైద్యులు ప్రశ్నించారు. సోమవారం నెల్లూరు నగరంలోని బృందావనం నుంచి బోసుబొమ్మ వరకు వైద్యులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. బాధితురాలు అభయకు న్యాయం చేయాలని కోరారు. గైనకాలజీ అసోసియేషన్ జాతీయ స్థాయిలో ఇచ్చిన పిలుపులో భాగంగా గైనకాలజీ సొసైటీ జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ పల్లంరెడ్డి యశోధర ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసన ప్రదర్శనలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర నేత డాక్టర్ అశోక్, డాక్టర్ సుప్రజ, డాక్టర్ చైతన్య, డాక్టర్ మిధిలా, డాక్టర్ హారిక తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు అక్రమ అరెస్టుకు ఏడాది

● టీడీపీ నేత అజీజ్

నెల్లూరు(వైద్యం), సెప్టెంబరు 9 : ఐదేళ్ల వైసీపీ పాలనలో టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును అక్రమంగా అరెస్టు చేసి సోమవారానికి ఏడాది పూర్తయిందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ ఒక ప్రకటనలో తెలిపారు. వైసీపీ రాక్షస పాలనకు ఇది మాయని మచ్చగా మిగిలిందని పేర్కొన్నారు. నీతి నిజాయితీ, చట్టబద్ధత, పారదర్శకత చంద్రబాబు ప్రత్యేకతని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమం, సామాజిక న్యాయమే ధ్యేయంగా పనిచేసిన చంద్రబాబుపై కక్షగట్టి వైసీపీ ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేస్తే దాన్ని నిరసిస్తూ 78 దేశాల్లో చంద్రబాబుకు సంఘీభావంగా ప్రదర్శనలు జరిగాయని పేర్కొన్నారు. రాజకీయాల్లో మచ్చలేని చంద్రబాబు అవినీతికి పాల్పడినట్లు ఒక్క ఆధారం కూడా జగన్ ప్రభుత్వం చూపలేదని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం నవ్యాంధ్ర పునర్నిర్మాణమే లక్ష్యంగా, అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ముందుకు వెలుతుందని తెలిపారు.

ఏపీసీ కమిటీ ఆమోదయోగ్యం కాదు

నెల్లూరు(వైద్యం), సెప్టెంబరు 9 : ఇటీవల విడుదల చేసిన ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆమోదయోగ్యం కాదని జిల్లా కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ అధ్యక్షుడు కొండా అనిల్‌కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏపీసీసీ ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల, కొంతమంది సీడబ్ల్యూసీ సభ్యుల సహకారంతో అనర్హులను ఎంపిక చేసిందని పేర్కొన్నారు. ఇతర పార్టీల్లో కోవర్టులుగా పని చేస్తున్న వారికి లోపాయికారిగా ఎంపిక చేశారని తెలిపారు. రాష్ట్ర మాజీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి బంధువు అయినందున పీసీసీ ఉపాధ్యక్షుడిగా ఉడతా వెంకట్రావ్‌యాదవ్‌ను ఎంపిక చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని పేర్కొన్నారు. దళిత సామాజిక వర్గానికి జిల్లాలో, రాష్ట్రంలో ఒక్క పదవి రాలేదని ఆందోళన వ్యక్తం చేశారు.

ఏపీఈజేయూ మహాసభ పోస్టర్ ఆవిష్కరణ

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 9: ఈనెల 17వ తేదీ జరగనున్న ఆంధ్రప్రదేశ్ ఎడిటర్ అండ్ జర్నలిస్ట్ యూనియన్ (ఏపీఈజేయూ) జిల్లా మహాసభ పోస్టర్‌ను కలెక్టర్ ఆనంద్ సోమవారం తన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఉడత రామకృష్ణ, రాష్ట్ర కోకన్వీనర్ గట్టుపల్లి శివకుమార్, కమిటీ సభ్యులు సరళమ్మ, షేక్ రిజ్వాన్, కలికి ఉదయ్ కుమార్‌రెడ్డి, ఆవుల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడిపై దాడి

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 9: వృద్ధుడిపై దాడి చేసిన నిందితులపై నవాబుపేట పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. నగరంలోని బోడిగాడితోటలో నివాసం ఉంటున్న శేఖర్ కుమారుడికి అదే ప్రాంతానికి చెందిన చక్రీతో విభేదాలున్నాయి. ఇటీవల వారు గొడవపడగా శేఖర్ వారించి ఇద్దరిని మందలించాడు. దీంతో చక్రి ఆవేశానికి లోనై తన స్నేహితులు బాలాజీ, రవి, గబ్బు, రాజు, అజయ్, అనుకాలతో కలిసి ఈ నెల 8వ తేది రాత్రి శేఖర్ ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించి అతనిపై దాడిచేసి గాయపరిచారు. క్షతగాత్రుడ్ని చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. బాధిత కుటుంబీకుల ఫిర్యాదుతో పోలీసులకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైతుల వివరాలు కంప్యూటరీకరించాలి

నెల్లూరు రూరల్, సెప్టెంబరు 9 : సొసైటీలో సభ్యులుగా ఉన్న రైతుల వివరాలు కంప్యూటరీకరణ చేయాలని, అందుకు రైతులు తమ వివరాలు అందచేయాలని పెద్దచెరుకూరు పీఏసీఎస్ సమావేశంలో తీర్మానించారు. సోమవారం పెద్దచెరుకూరులో జరిగిన సర్వసభ్య సమావేశంలో సొసైటీ పర్సన్ ఇన్‌చార్జీ ఎం మోహన్‌కృష్ణ, సీనియర్ ఇన్‌స్పెక్టర్ టీ బాబు, సీఈవో సీహెచ్ మోహన్‌లు మాట్లాడారు. రైతులంతా తమ ఆధార్‌ను పట్టాదారు పాసుపుస్తకంతో అనుసంధానం చేసుకోవాలని సూచించారు. అనంతరం 2023-24 ఆర్థిక సంవత్సరం ఆడిట్ రిపోర్టును సభ్యుల ముందుంచారు. సంఘంలోని ఆధీకృత షేరు ధనము పెంచుకునేందుకు సంఘం కృషి చేయాలని అందుకు అందరూ సహకరించాలని కోరారు.

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట	: 99854 38368
చిత్తూరు, పూతలపట్టు, గంగాధర నెల్లూరు	: 99854 10940
పలమనేరు, కుప్పం, పుంగనూరు	: 97036 18724
మదనపల్లి, పీలేరు, తంబళ్లపల్లి	: 99854 22298
శ్రీకాళహస్తి, పుత్తూరు, నగరి, సత్యవేడు	: 99890 59755







బై బై గణేశా



వినాయక నిమజ్జన వేడుకలు సోమవారం పలుచోట్ల ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. మూడురోజుల పాటు పూజలందుకున్న విఘ్ననాథుల విగ్రహాలను భక్తిశ్రద్ధలతో పెద్దలూపిల్లలూ ఊరేగింపుగా నిమజ్జనానికి తరలించారు. తిరుపతిలోని వినాయకసాగర్, తిరుచానూరు సమీపంలోని దామినీడు చెరువు, వాకాడు మండల పరిధిలోని తూపిలిపాళెం తీరం, గూడూరులోని పంబలేరు, తొట్టంబేడు మండలంలోని చిన్న సింగమాల, తంగేళ్లపాళెం సమీపంలోని తెలుగుగంగ కాలువ, సత్యవేడులోని తెలుగుగంగ కాలువలతో పాటు ఆయా ప్రాంతాల్లోని చెరువుల్లో వినాయక నిమజ్జనోత్సవాలు వైభవోపేతంగా సాగాయి. తిరుపతి వినాయక సాగర్‌లోనే సోమవారం రాత్రి 11 గంటల సమయానికి దాదాపు 400 విగ్రహాలను నిమజ్జనం చేసినట్లు సమాచారం.







తిరుపతి వినాయక సాగర్‌లో నిమజ్జన సందడి



తూపిలిపాళెం తీరంలో సందడి



నాయుడుపేటలో విషాదం

● తూపిలిపాళెం సముద్రతీరంలో ఒకరి మృతి... మరొకరి గల్లంతు

వాకాడు, సెప్టెంబరు 9 :వినాయక నిమజ్జనోత్సవంలో విషాదం చోటుచేసుకుంది.వాకాడు మండల పరిధిలోని తూపిలిపాళెం సముద్రతీరంలో సోమవారం అలల ఉధ్రుతికి మునిగిపోయి ఒకరు మృతి చెందగా, మరొకరు గల్లంతయ్యారు.ఎస్‌ఐ నాగబాబు కథనం మేరకు...నాయుడుపేట కావమ్మగుడి సెంటర్‌కు చెందిన యువకులు వినాయక విగ్రహాన్ని తూపిలిపాళెం సముద్రతీరానికి ఊరేగింపుగా తీసుకువచ్చారు. వినాయకుడిని నిమజ్జనం చేస్తుండగా ఒక్కసారిగా వచ్చిన అలలతాకిడికి ఫయాజ్ (22) మృతువాత పడ్డాడు. మునిరాజ అనే యువకుడు (23) గల్లంతయ్యాడు.వీరితో పాటు వున్న శ్రీనివాసులును మత్స్యకారులు రక్షించారు. ఫయాజ్‌కు చిన్నతనంలోనే తండ్రి మృతి చెందడంతో తల్లి అన్నీ తానై పెంచింది. డిగ్రీ చదువుకున్న ఫయాజ్ రెడీమేడ్ షాపులో పనిచేస్తూ తల్లికి సహాయంగా ఉండేవాడు.గల్లంతైన మునిరాజ ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తూ కుటుంబానికి చేదోడువాదోడుగా ఉండేవాడు. మునిరాజ కోసం గజ ఈతగాళ్లు గాలిస్తున్నారు. శవ పంచనామా నిమిత్తం ఫయాజ్ మృతదేహాన్ని బాలిరెడ్డిపాళెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఫయాజ్ మృతదేహం

అమ్మానాన్నకు ప్రేమతో ....

సత్యవేడు, సెప్టెంబరు 9: అమ్మనాన్నలకు కానుకగా ఇచ్చేందుకు ఓ ఎన్‌ఆర్‌ఐ వేలం పాటలో గణేశ్ లడ్డును దక్కించుకున్న సంఘటన ఇది.సత్యవేడు మండలం మల్లవారిపాళెం వెస్ట్‌కు చెందిన చెల్లప్పరెడ్డి, భారతి దంపతుల కుమారుడు జశ్వంత్ వృత్తిరీత్యా లండన్‌లో ఉంటున్నాడు. వినాయక చవితి సందర్భంగా గ్రామానికి విచ్చేసిన జశ్వంత్ తన తల్లితండ్రులకు ఏదైన కానుక ఇవ్వాలనుకున్నాడు. దీంతో గ్రామంలో చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన వినాయకుడి చేతిలోని 22 కేజీల లడ్డును వేలం పాటలో రూ.లక్ష నలభైవేలకు పాడి దక్కించుకుని తల్లిదండ్రులకు అందించాడు.

స్వర్ణ నెమలిపై వినాయకుడు



కాణిపాకంలోని వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం వరసిద్ధి వినాయకస్వామి స్వర్ణ నెమలి వాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమానికి కాణిపాకం, చినకాంపల్లె, కొత్తపల్లె, చిగరపల్లె, అగరంపల్లె, వడ్రాంపల్లె, దామరగుంట, కురప్పల్లె గ్రామాలకు చెందిన రెడ్డి వంశస్థులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఉదయం స్వామికి ఉభయదారుల ఆధ్వర్యంలో భక్తి శ్రద్ధలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం సిద్ధి, బుద్ధి సమేత వినాయక స్వామి ఉత్సవమూర్తులను నెమలి వాహనంపై ఉంచి పురవీధులలో ఊరేగించారు. రాత్రి ఉభయదారులు గంగుండ్రి మండపం నుంచి ఉభయ వరస తీసుకు రావడంతో అలంకార మండపంలో సిద్ధి,బుద్ధి సమేత వరసిద్ధుడి ఉత్సవర్లకు పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను స్వర్ణ నెమలిపై అధిష్టింపచేసి పురవీధులలో ఊరేగించారు. సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డి, ఈవో గురుప్రసాద్, ఉభయదారులు పాల్గొన్నారు.

కాణిపాకంలో నేడు: బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం మూషిక వాహన సేవ నిర్వహించనున్నారు. కాణిపాకం, అగరంపల్లె, కాణిపాకపట్నం, వడ్రాంపల్లె, కొత్తపల్లె, చినకాంపల్లె, తిరువణంపల్లెలకు చెందిన విశ్వకర్మ వంశస్థులు ఉభయదారులుగా వ్యవహరించనున్నారు.

- ఐరాల(కాణిపాకం)

వరద బాధితులను ఆదుకుందాం

భూరి విరాళాలతో ముందుకు రావాలన్న కలెక్టర్

తిరుపతి(విద్య), సెప్టెంబరు 9: కలెక్టరేట్ అధికారులు, ఉద్యోగులు, జిల్లా ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, తదితరులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి వరద బాధితుల సహాయార్థం రాష్ట్ర ప్రభుత్వానికి విరాళాలు అందించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. తమ విరాళాలను తిరుపతి జిల్లా కలెక్టర్ బ్యాంక్ అకౌంట్ నెంబరు 40915068394, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్: ఎస్‌బీఐఎన్0013401, పద్మావతీపురం ఎస్‌బీఐ బ్రాంచి పేరున విరాళాలను జమ చేయొచ్చని లేదంటే చెక్ ద్వారానూ అందించాలని కోరారు. జిల్లా యంత్రాంగం నుంచి ఇప్పటికే కొంత సాయం అందజేశామని వెల్లడించారు. ఈ క్రమంలో వివిధ పరిశ్రమలు, దాతల ద్వారా 3 లక్షల వాటర్ బాటిళ్లు, 75వేల పాల ప్యాకెట్లు, జిల్లా మహిళా సమాఖ్య నుంచి 1.3 లక్షల బిస్కెట్ ప్యాకెట్లు, 20వేల అగ్గిపెట్టెలు, 20వేల కొవ్వొత్తులు విజయవాడకు పంపించామని వివరించారు. రెవెన్యూ శాఖ నుంచి 200 మంది, మున్సిపాలిటీ, పంచాయతీ తదితర శాఖలనుంచి పలువురు అధికారులు, సిబ్బంది విజయవాడ ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యల్లో నిమగ్నమై ఉన్నారని కలెక్టర్ తెలిపారు.



కలెక్టర్‌కు చెక్కు అందజేస్తున్న డీఆర్వో కిషోర్

కలెక్టర్, డీఆర్వో విరాళం

వరద బాధితుల సహాయార్థం కలెక్టర్ వెంకటేశ్వర్, డీఆర్వో పెంచలకిషోర్ సోమవారం ఆర్థిక సాయాన్ని ప్రకటించారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగి ఓ కార్యక్రమంలో.. రాష్ట్రంలో కురిసిన భారీ వర్షాలతో విజయవాడ తదితర ప్రాంతాల్లో రాష్ట్రప్రభుత్వం వరద బాధితులను ఆదుకునేందుకు ఎంతో కృషి చేస్తోందని చెప్పారు. అందువల్ల తన నెల జీతంలో సగ భాగాన్ని ప్రభుత్వానికి అందజేస్తానని కలెక్టర్ ప్రకటించారు. అలాగే తనవంతుగా డీఆర్వో పెంచలకిషోర్ కూడా రూ.25వేల చెక్‌ను కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి అందజేశారు.



రూ.10లక్షలందజేసిన డాలర్స్ దివాకర్‌రెడ్డి

తిరుపతి రూరల్, సెప్టెంబరు 9: తిరుపతి రూరల్ మండలం పెరుమాళ్లపల్లెకి చెందిన టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాలర్స్ దివాకర్‌రెడ్డి విజయవాడ వరదబాధితుల సహాయార్థం రూ.10లక్షలను విరాళంగా అందజేశారు. ఈమేరకు సోమవారం విజయవాడలో మంత్రి నారా లోకేష్‌ని మర్యాదపూర్వకంగా కలసి చెక్కు అందజేశారు. అలాగే సీఎం చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిసినట్లు పేర్కొన్నారు.

ఎస్వీయూ టీచింగ్ అసిస్టెంట్ దాతృత్వం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 9: వరద బాధితుల కోసం ఏపీ సీఎం సహాయ నిధికి రూ.లక్ష విరాళాన్ని ఎస్వీయూనివర్సిటీ కామర్స్ విభాగంలో అకడమిక్ కన్సల్టెంట్‌గా ఉన్న డాక్టర్ ఎస్. శివశంకర్ చెక్కు రూపంలో పంపారు. సహచర అకడమిక్ కన్సల్టెంట్లు అభినందించారు.

సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు



అర్జీలు స్వీకరిస్తున్న సబ్‌కలెక్టర్

గూడూరు, సెప్టెంబరు 9: ప్రజా వేదికలో వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరిస్తామని సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనా అన్నారు. సోమవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో డివిజన్‌లోని వివిధ ప్రాంతాల నుంచి పలువురు తమ సమస్యలను పరిష్కరించాలని సబ్‌కలెక్టర్‌కు వినతులు అందజేశారు. ఉచిత ఇసుక విధానం అందుబాటులో లేకపోవడంతో ధరలు అధికంగా ఉన్నాయని దీంతో భవన నిర్మాణ కార్మికులకు పనులు లేకుండా పోతున్నాయని ఇసుక పాయింట్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని సీఐటీయూ నాయకులు విన్నవించారు. చిల్లకూరు మండలం తిక్కవరానికి చెందిన రమణయ్య సహా పలువురు తెలుగుగంగ కాలువకు వెళ్లే మార్గాన్ని అక్రమించుకున్నారని చర్యలు తీసుకోవాలని విన్నవించారు.

కోటలో పోషకాహార మాసోత్సవాలు

కోట, సెప్టెంబరు 9: పట్టణ పరిధిలోని శ్యామసుందరపురంలో సోమవారం పోషకాహార మాసోత్సవాలు జరిగాయి. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కృష్ణమ్మ ఆధ్వర్యంలో పౌష్టికాహారానికి సంబంధించి కూరగాయలు, ఆకుకూరల ప్రాముఖ్యతను వివరించారు. గర్భిణులు, బాలింతలు పౌష్టికాహాన్ని తీసుకునే విధానంపై ప్రయోగాత్మకంగా వివరించారు. అనంతరం సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు ఆకుకూరలను ప్రదర్శనగా ఉంచారు.

చలో కోటను విజయవంతం చేద్దాం



వాల్‌పోస్టర్ల ఆవిష్కరణలో నాయకులు

కోట, సెప్టెంబరు 9: పట్టణంలో ఈనెల 11వ తేదీ జరిగే ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక సదస్సుకు మాలలు వేలాదిగా తరలిరావాలని వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు. కోటలో సోమవారం హలో మాల... చలో కోట సదస్సు పోస్టర్లను ఆవిష్కరించారు. కోట క్రాస్ రోడ్డులో రాజకీయ ప్రేరణతో రాజ్యాంగ విరుద్ధంగా సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణను రాష్ట్రాలు వర్గీకరించుకోవచ్చన్న తీర్పును నిరసిస్తూ నిరసన ర్యాలీ నిర్వహిస్తామన్నారు. ఇందుకోసం కోట, వాకాడు, చిట్టమూరు, చిల్లకూరు మండలాల మాలలు తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. అన్నదమ్ములుగా కలసి ఉన్న మాలమాదిగలను రాజకీయ కుట్రతో వేరుచేసే ప్రయత్నాన్ని తిప్పి కొడదామంటూ పిలుపునిచ్చారు. ఎం.మాధవ్, వసంత్‌కుమార్, అశోక్‌కాంబ్లే, హేమంత్, శ్రీనివాసులు, రంగయ్య, సుందరం, కేశవ్, కృష్ణయ్య తదితరులు ఉన్నారు.

ఇసుక అక్రమ రవాణా: మూడు ట్రాక్టర్ల స్వాధీనం



కోట, సెప్టెంబరు 9: మండలంలోని గూడలి స్వర్ణముఖీ నదిలో నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పవన్‌కుమార్ సోమవారం తెలిపారు. గూడూరు, అయ్యవారిపాళెం, చిల్లకూరు గ్రామాలకు చెందిన యువకులు ఎలాంటి అనుమతులు లేకుండా నదిలోకి ప్రవేశించి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారన్నారు. సమాచారం మేరకు దాడులు జరిపి మూడు ట్రాక్టర్లను సీజ్ చేసి కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

మాచవరం చెరువు హద్దులు చూపించండి

● తహసీల్దారును కోరిన ఇరిగేషన్ ఏఈ

ఓజిలి, సెప్టెంబరు 9: మండలంలోని మాచవరం చెరువు హద్దులను చూపించాలని జల వనరుల శాఖ ఏఈ వీరాస్వామి సోమవారం తహసీల్దారును కోరారు. ఈ మేరకు ఆయన తహసీల్దారుకు వినతి చేశారు. ఆక్రమణలతో చెరువు కుంచించుకు పోయిందని ఫలితంగా సరిపడా నీరు నిల్వ ఉండడం లేదని పలువురు అయకట్టు రైతులు ఏఈ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఆయన రెవెన్యూ అధికారులతో మాట్లాడి సమస్యకు పరిష్కారం చూపుతామని రైతులకు హామీ ఇచ్చారు. ఈ మేరకు హద్దులను చూపాల్సిందిగా తహసీల్దారుకు వినతి చేశారు. చెరువు హద్దులు చూపించిన వెంటనే శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని ఏఈ చెప్పారు.

రైలు కింద పడి ఒకరి మృతి

గూడూరు, సెప్టెంబరు 9: స్థానిక రైల్వే స్టేషన్‌లో సోమవారం రాత్రి ప్రమాద వశాత్తు రైలు కింద పడి ఓ వ్యక్తి మృతి చెందాడె. రైల్వే జీఆర్ పోలీసుల వివరాలు మేరకు... ఉత్తప్రదేశ్ రాష్ట్రానికి చెందిన రవికాంత్(35) చెన్నై నుంచి గంగా కావేరి ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరారు. రైలు గూడూరు రైల్వే స్టేషన్ రెండో ప్లాట్‌ఫాంలో నిలవడంతో కిందకు దిగాడు. తిరిగి కదులుతున్న రైలు ఎక్కే క్రమంలో జారిపడి అక్కడిక్కడే దుర్మరణం చెందాడు.

మత సామరస్యానికి ప్రతీక

● ఆసియాలోనే అతి పెద్ద 144 అడుగుల సమాధి

● నేడు వేనాడు అల్లాతాత దర్గా 29వ గంధోత్సవం

తడ, సెప్టెంబరు 8: భక్తుల విశ్వాసానికి ప్రతీక ఆ సమాధి... మత సామరస్యానికి ఆ సమాధే నిలువెత్తు నిదర్శనం.. అదే వేనాడులో ఉన్న షేక్ దావూద్ షా వలీ అల్లాతాత దర్గా. 634 ఏళ్ల క్రితం అరబ్ దేశాల నుంచి సముద్ర జలాల్లో పడవల మీదుగా కొందరూ పకీర్లు శ్రీహరికోట మీదుగా వేనాడు దీవికి వచ్చారు. అందులో ఓ పకీర్ ఆ గ్రామంలో ప్రస్తుతం దర్గా ఉన్న ప్రదేశంలో జువ్వి చెట్టు వద్దకు చేరుకుని అక్కడే ప్రార్థనలు చేసుకొంటూ అక్కడికి వచ్చే గ్రామస్తులకు ఆరోగ్య చిట్కాలు చెబుతూ ఉండేవాడు. అలా కొద్ది రోజులు ప్రార్థనల తరువాత అక్కడికి వచ్చిన పశువుల కాపర్లతో తాను ఇక్కడ పడుకుంటానని తనపై ఇసుకను పోసి కప్పాలని కోరారు. అలాగే శనగలు, బెల్లం, బొరుగులు ఉంటాయని వాటిని తీసుకుని వెళ్లాలని గ్రామస్తులను కోరారు. ఆ పకీర్ కోరిక మేరకు గ్రామస్తులు అలాగే చేసి ఇసుకతో కప్పివేసిన తరువాత గ్రామంలోకి వెళ్లారు. ఈ విషయాన్ని గ్రామస్తులకు చెప్పడంతో వారందరూ ఆ ప్రదేశానికి చేరుకుని పలుగు, పారలతో ఆ ఇసుకను తొలగించి ఆ పకీరును బయటకు తీసేందుకు ప్రయత్నించారు. ఇసుకను తీయలేకపోగా ఆ సమాధి అలా పెరుగుతూ పోవడంతో మహిమ గల పకీరని గ్రామస్తులు వెనుదిరిగారు. అలా సమాధి 144 అడుగుల వరకు పెరిగి ఓ వృక్షం వద్ద ఆగిపోయింది. అలా ఆసియాలోనే అతిపెద్ద సమాధిగా ఈ పకీర్ పేరుగాంచారు.



గంధోత్సవానికి ముస్తాబైన బాబా సమాధి

ఏఆర్ రెహమాన్ రాకతో ప్రాచుర్యంలోకి...

వేనాడులో ఉన్న పకీర్‌కు గ్రామంలోని హిందువులే పూజలు చేస్తుండేవారు. ప్రతి అమావాస్య నాడు ఆ సమాధి నుంచి పకీర్ ఉచ్వాస, నిచ్వాసాలు వెలువడుతాయని గ్రామస్తుల నమ్మకం. ఇక్క అక్కడ నిద్ర చేస్తే బాబా ఆశీస్సులు దొరుకుతాయని భక్తుల నమ్మకం. ఇలా ఈ పకీరు షేక్ దావూద్ షా వలీ అల్లాతాతగా కొలుస్తున్నారు. పులికాట్ సరస్సులోని మారుమూల గ్రామం వేనాడు. ప్రసిద్ధ సినీ సంగీత దర్శకులు ఏఆర్ రెహమాన్ 30 ఏళ్లక్రితం దర్గాకు వచ్చి పూజలు జరిపించిన తరువాత దర్గా చరిత్ర బయట ప్రపంచానికి తెలిసింది. ఆయన ఆధ్వర్యంలో మొట్టమొదటిసారి 28 ఏళ్ల కిత్రం గంధోత్సవాన్ని నిర్వహించారు. మంగళవారం 29వ గంధోత్సవానికి గ్రామ పెద్దలు ఏర్పాటు చేస్తున్నారు. మరోవైపు అల్లాతాత దర్గా పర్యవేక్షణ గ్రామస్తుల చేతుల మీదుగానే జరుగుతుంది. గంధోత్సవం నాడు గ్రామస్తులు సారెతో బాబాచెంతకు చేర్చి నిర్వహించడం ఆనవాయితీ. ఇలా హిందువుల చేతుల మీదుగానే ఈ దర్గా ప్రస్థానం మొదలై నేటికి కొనసాగుతుండడం మతసమరస్యానికి ప్రతీకగా చెప్పుకోవచ్చు.

విద్యుద్దీపాలతో, పూలతో అలంకరణ

గంధోత్సవం సందర్భంగా దర్గా ప్రాంగణమంతా విద్యుత్ దీపాలంకరణలు పూలతో అలంకరించారు. భక్తుల రద్దీ దృష్ట్యా పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. తమిళనాడు, కేరళ, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో గంధోత్సవానికి హాజరయ్యే అవకాశం ఉండటంతో ఆర్టీసీ సైతం సుమారు 20 వరకు ప్రత్యేక బస్సులను నడపనుంది. ఏటా గంధోత్సవం ఘనంగా నిర్వహించేవారు. గత నాలుగేళ్లల్లో మొక్కుబడిగా నిర్వహించారు. అయితే టీడీపీ అధికారంలోకి రావడంతో స్థానిక నాయకుడు సుదర్శన్ మొదలి ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి.

భారీ బందోబస్తు

వేనాడులో దావూద్‌షావలి అల్లాతాత దర్గా 29వ గంధోత్సవానికి పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని సూళ్లూరుపేట సీఐ మురళీకృష్ణ అన్నారు. నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు ఆధ్వర్యంలో ముగ్గురు సీఐలు, 8 మంది ఎస్ఐలు, సుమారు 100 మంది వరకు ఏఎస్ఐలు, ఇతర సిబ్బంది బందోబస్తు ఏర్పాట్లలో ఉంటారన్నారు. మంగళవారం జరిగే గంధోత్సవానికి ఆర్టీసీ సైతం ప్రత్యేక బస్సులను నడపనున్నారు.

ఘనంగా వినాయక నిమజ్జనం







గూడూరు, కోట పట్టణాల్లో నిమజ్జనానికి తరలుతున్న గణపయ్య ప్రతిమలు - వేలంలో దక్కించుకున్న లడ్డూతో వెంకటేశ్వర్లురాజు

గూడూరు, సెప్టెంబరు 9: పట్టణ, సమీప ప్రాంతాల్లో చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన వినాయ ప్రతిమలను సోమవారం నిమజ్జనానికి తరలించారు. ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక ప్రతిమల వద్ద పూజలు నిర్వహించి, భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేసి లడ్డూలను వేలం వేశారు. అనంతరం పూలతో అలంకరించిన వాహనాలపైకి ప్రతిమనలు చేర్చారు. తీన్‌మార్ బ్యాండ్లు, వాయిద్యాల నడుమ యువత చిందులేస్తూ భోలో జై గణేశ్ మహరాజ్‌కి జై అంటూ నిమజ్జనానికి తరలించారు. కొన్ని ప్రతిమలను వాకాడు మండలం తూపిలిపాళెం సముద్రంలో, కొన్ని ప్రతిమలను పంబలేరు వాగులో నిమజ్జనం చేశారు.

రూ.76వేలు పలికిన గణపతి లడ్డూ

గూడూరు అర్బన్: మండలంలోని పారిచెర్లరాజుపాళెం గ్రామంలో నిర్వహిస్తున్న వినాయకచవితి ఉత్సవాల్లో భాగంగా సోమవారం స్వామి వారికి నివేదించిన లడ్డూను వేలం వేశారు. మాజీ సర్పంచు ముప్పాళ్ల వెంకటేశ్వర్లురాజు రూ. 76 వేలకు లడ్డూను దక్కించుకున్నారు.

వాకాడు: మూడు రోజులపాటు విశేష పూజలు అందుకున్న గణనాథులను సోమవారం తూపిలిపాళెం సముద్రతీరంలో భక్తులు నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ నాగబాబు తెలిపిన వివరాల మేరకు శ్రీకాళహస్తి, నాయుడుపేట, వాకాడు, కోట, చిట్టమూరు, గూడూరు తదితర మండలాల నుంచి 500కు పైగా ప్రతిమలు వచ్చాయని తెలిపారు.

కోట: చవితి ఉత్సవాలను పురస్కరించుకొని మూడో రోజు పలు గ్రామాల్లో గణనాథుల ప్రతిమలకు గ్రామోత్సవాలు జరిగాయి. విద్యానగర్, కోట, చెందోడు తదితర గ్రామాల్లో యువకులు మేళతాళాలతో కేరింతలు కొడుతూ ప్రతిమలను వాకాడు మండలం తూపిలిపాళెం, కోట మండలం శ్రీనివాససత్రం సముద్రతీరాల్లో నిమజ్జనం చేశారు.

వెంకటగిరి టౌన్: చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రతిమలను మూడోరోజు ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో నిమజ్జనానికి సమీపంలోని తెలుగుగంగ కాలువకు తరలించారు. సీఐ ఎ.వి.రమణ ఆధ్వర్యంలో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు.

నాయుడుపేట: చవితి ఉత్సవాల్లో భాగంగా 3వ రోజు సోమవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక ప్రతిమలు సోమవారం నిమజ్జనానికి తరలించారు. డీజే వాయిద్యాల నడుమ రంగులు చల్లుకుంటూ, కేరింతలతో ప్రతిమలను వాకాడు మండలం తూపిలిపాళెం సముద్రంలో నిమజ్జనం చేశారు.

ముంపు బాధితుల సేవలో డక్కిలి రెవెన్యూ సిబ్బంది



డక్కిలి, సెప్టెంబరు 9: విజయవాడ వరద ముంపులో చిక్కుకున్న బాధితులకు డక్కిలి తహసీల్దార్ శ్రీనివాసులు, సిబ్బందితో కలిపి సేవలందిస్తున్నారు. వారం రోజుల క్రితం వీరంతా విజయవాడకు చేరుకుని సహాయక చర్యల్లో భాగంగా లబ్బీపేట కాలనీలో పని చేస్తున్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీనివాసులు ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ.. విజయవాడలో ఇప్పుడిప్పుడే సాధారణ పరిస్థితికి చేరుకుంటోందని చెప్పారు. అంటువ్యాధులు ప్రబలకుండా పారిశుధ్యం మెరుగు పరచడం, బాధితులకు ప్రభుత్వ సహాయక కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నట్లు వివరించారు. వరద నీరు దాదాపుగా వెళ్లిపోయిందన్నారు. ఇంకో నాలుగైదు రోజులు ఇక్కడే తాము విధులు నిర్వహిస్తామన్నారు.

వేడుకగా గణేశ ఉత్సవాలు



వెంకటగిరి, సెప్టెంబరు 9: పట్టణంలో చవితి ఉత్సవాలు వేడుకగా జరుగుతున్నాయి. సోమవారం కాశీపేట సెంటరు వద్ద ఏర్పాటు చేసిన గణేశ మంటపాన్ని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ సందర్శించారు. ఈ సందర్భంగా గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అన్నదానాన్ని ప్రారంభించారు. పులికొల్లు రాజేశ్వరరావు, మంకు ఆనంద్, బీరం రాజేశ్వరరావు, పునుగోటి విశ్వనాథనాయుడు, కాపా శ్రీనవాసులు నాయుడు, గంగాదర్, మల్లారం బాబు, సుధ, నపరిసింహులు తదితరులు వున్నారు.

వినాయ ప్రతిమల వద్ద ఉట్టి

చిల్లకూరు, సెప్టెంబరు 9: చవితి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని పలు వినాయ ప్రతిమల వద్ద సోమవారం యువత ఉట్టి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించింది. తప్పెట్లు వాయిస్తూ ఉట్టిని కొట్టారు. కూడళ్ల వద్ద ఏర్పాటు చేసిన ప్రతిమలకు పూజలు నిర్వహించారు.

నిమజ్జనానికి వసతుల కల్పనలో అధికారుల నిర్లక్ష్యం



ఒడ్డున గుట్టలుగా పడిఉన్న వినాయక ప్రతిమల ముక్కలు

వాకాడు, సెప్టెంబరు 9: అత్యంత ఘనంగా జరుపుకునే ప్రధాన పండగ వినాయక చవితి. తిరుపతి, నెల్లూరు జిల్లాల నుంచి నిమజ్జనానికి తూపిలిపాళెం సముద్రతీరానికి సోమవారం భారీగా ప్రతిమలను భక్తులు తీసుకొచ్చారు. అధికారుల నిర్లక్ష్యంతో సముద్రతీరాన పారిశుధ్యలోపం కొట్టొచ్చినట్టు కన్పించింది. నిమజ్జనం చేసిన ప్రతిమల ముక్కలు విరిగిపడి సముద్రం ఒడ్డునే చేరడంతో వాటిని తొక్కుకొంటూ 3వ రోజు భక్తులు నిమజ్జనం చేయాల్సిన పరిస్థితి దాపురించింది. గతంలోనూ నిమజ్జన సమయంలో రోడ్డు ప్రమాదాలు, అలల తాకిడికి మృత్యువాత పడిన సంఘటనలున్నాయి. గతంలో జరిగిన పొరపాట్లు దృష్టిలో ఉంచుకొని నిమజ్జనాన్ని సజావుగా జరిపించాల్సిన అధికారులు నిర్లక్ష్యం కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయి. సముద్ర ఒడ్డున భారీ క్రేన్లను ఏర్పాటు చేసి నిమజ్జన ఏర్పాట్లు చేసినట్లైతే ప్రమాదాలు జరగవని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఒక్క సీసీ కెమెరా వందమంది పోలీసులతో సమానం



దుకాణదారులకు సూచనలిస్తున్న డీఎస్పీ చెంచుబాబు

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 9: ఒక్క సీసీ కెమెరా వందమంది పోలీసులతో సమానమని నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు అన్నారు. డీఎస్పీ కార్యాలయంలో సోమవారం బంగారు దుకాణాలు, హోల్‌సేల్ దుకాణాల యజమానులతో డీఎస్పీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పట్టణంలోని ప్రధాన రహదారులతోపాటు అపార్ట్‌మెంట్లు, షాపింగ్ మాళ్లు, బంగారు దుకాణాల్లో సీసీ కెమెరాలను ఖచ్చితంగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఇళ్లకు తాళాలు వేసి వెళ్లే వారు ఎల్‌హెచ్‌ఎంఎస్(లాక్‌డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం)ను ఉపయోగించుకోవాలని తెలిపారు. వాహనదారులు హెల్మెట్లు ధరించాలని, అలాగే కార్లల్లో ప్రయాణించేవారు సీట్ బెల్టులను వినియోగించాలన్నారు. శాంతి భద్రతల సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అర్బన్ సీఐ బాబి పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధికి రూ.38 లక్షల చెక్కు అందజేత



లోకేశ్‌కు చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే

గూడూరు, సెప్టెంబరు 9: వరద బాధితుల సహాయార్థం సీఎం సహయనిధికి రూ.38 లక్షల చెక్కును సోమవారం విజయవాడలో మంత్రి లోకేశ్‌కు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... విజయవాడలో సంభవించిన వరదల కారణంగా నిస్సహాయస్థితికి చేరకున్న ప్రజలను ఆదుకునేందుకు సీఎం చంద్రబాబు అహర్నిశలు కష్టపడుతున్నారన్నారు. ముఖ్యమంత్రిని ఆదర్శంగా తీసుకుని నియోజకవర్గంలో పలువురు ముందుకు వచ్చి సీఎం సహాయ నిధికి రూ.38,32441 చెక్కులను అందించారన్నారు. అంతేకాకుండా తన సొంతనిధుల నుంచి రూ.5 లక్షల విలువైన రెండు వేలకు పైగా దుప్పట్లను వరద బాధితులకు అందిస్తున్నామన్నారు. మూడు రోజులపాటు విజయవాడలో ఉంటూ బాధితులకు సాయం అందిస్తామన్నారు. ఎమ్మెల్యే వెంట కిశోర్‌నాయుడు, నటశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఆపన్నహస్తం



లక్ష్మీదేవి కుటుంబీకులకు సుష్మారెడ్డి సాయం

కోట, సెప్టెంబరు 9: విజయవాడ వరద బాధితులకు, నిరుపేద దళిత కుటుంబానికి తనవంతు సహకారం అందించారు. తెలుగుమహిళ జిల్లా ఉపాధ్యక్షురాలు గండవరం సుష్మారెడ్డి. మండల పరిధిలోని తిన్నెలపూడి దళితవాడలో జరిగిన అగ్నిప్రమాదంలో బి.లక్ష్మీదేవి మృతి చెందింది. దీంతో ఆ కుటుంబానికి రూ. 10వేలను అందజేశారు. అదే విధంగా విజయవాడ వరద బాధితుల సహాయార్థం రూ.30వేలను సుష్మారెడ్డి టీడీపీ మండల అధ్యక్షుడు ఎం.సర్వోత్తమరెడ్డికి అందజేశారు.

సీఎం సహాయనిధికి విరాళం

గూడూరు అర్బన్, సెప్టెంబరు 9: సీఎం సహాయనిధికి పలువురు టీడీపీ నాయకులు విజయవాడకు వెళ్తున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్‌కు చెక్కులను అందజేశారు. చిల్లకూరు మండలానికి చెందిన టీడీపీ నాయకులు రూ.7లక్షలు, కోట మండల టీడీపీ నాయకులు రూ.2.25లక్షలు, గూడూరు మండలం మాజీ వైస్ ఎంపీపీ ఎం.శ్రావణి రూ.50వేలు, ఇతరులు కూడా చెక్కులను ఎమ్మెల్యేకు ఆయన నివాసంలో అందజేశారు.

సీపీఎం ఆధ్వర్యంలో...



గూడూరు: విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు సీపీఎం ఆధ్వర్యంలో విరాళాల సేకరణను చేపట్టినట్లు నాయకులు చెప్పారు. సోమవారం పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో విరాళాలు సేకరించారు. వరద బాధితులను ఆదుకునేందుకు దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమకు తోచిన సాయాన్ని అందించాలన్నారు. ఈ కార్యక్రమం ద్వారా సేకరించిన రూ.8,850 నగదును రాష్ట్ర కమిటీకి అందిస్తామన్నారు. కార్యక్రమంలో శివకుమార్, శ్రీనివాసులు, బి.వి.రమణయ్య, శంకరయ్య, సురేష్, ప్రసాద్, మణి, శేఖరాచారి, వినయ్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సహకారంతో బాధితులకు దుప్పట్లు



దుప్పట్లను పంపుతున్న టీడీపీ నాయకులు

గూడూరు, సెప్టెంబరు 9: విజయవాడలో వరదల కారణంగా ఇబ్బంది పడుతున్న బాధితులకు చేయూ తనందించేలా ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ తన సొంత నిధులతో దుప్పట్లను అందించేలా చర్యలు తీసుకున్నారని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి శీలం కిరణ్‌కుమార్ అన్నారు. సోమవారం స్థానిక టవర్‌క్లాక్ సెంటర్ నుంచి విజయవాడకు పంపే దుప్పట్ల వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు. పి.శ్రీనివాసులు, ఎస్.చెంచు రామయ్య, రవీంద్రరెడ్డి, మురళి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధికి రూ.55వేలు అందజేత



నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 9: వరద బాధితుల సహాయార్థం సీఎం సహాయనిధికి షార్ రిటైర్డ్ ఉద్యోగి పాపయ్య రూ.55వేల చెక్కును సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యంకు అందజేశారు. టీడీపీ నాయకులు శ్రీనివాసులునాయుడు, శోభన్‌నాయుడు, ధనంజయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలను గుర్తించండి

తడ, సెప్టెంబరు 9: మండలంలోని కాళంగి నది, పాముల కాలువ పరీవాహన ప్రాంతాల్లో ఆక్రమణలపై సర్వే చేపట్టి నివేదికలు సమర్పించాలని తహసీల్దారు శరత్‌బాబు ఆదేశించారు.స్థానిక తహసీల్దారు కార్యాలయంలో ఆయన వీఆర్వోలు, సర్వేయర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వం ఆక్రమణలపై నివేదిక కోరిందని ఈ మేరకు ప్రతి గ్రామంలో వాస్తవ పరిస్థితులను గుర్తించాలన్నారు.

బాల్య వివాహాల నిషేధ చట్టంపై అవగాహన

నాయుడుపేట, సెప్టెంబరు 9 : బాల్య వివాహాల నిషేధ చట్టంపై సీడీపీవో ఉమామహేశ్వరి అవగాహన కల్పించారు. పట్టణంలోని బాలికల వసతిగృహంలో సోమవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... బాల్య వివాహాలు జరుగుతున్నట్టు తెలిస్తే టోల్‌ఫ్రీ నెం.1098కు ఫోన్ చేసి వివరాలు చెప్పాలన్నారు. ఐసీడీఎస్ సూపర్ వైజర్ హసీదాబేగం, వార్డెన్ సరిత, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.